

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 123 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | మంగళవారం 9 సెప్టెంబర్ 2025 | వెల : 4/-

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

# రండి.. హైదరాబాద్‌ను అభివృద్ధి చేద్దాం

- అభివృద్ధికి అందరూ కలిసి రావాలి
- ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తాం
- ఎవరెన్ని కుట్రలు చేసినా తమ ప్రభుత్వం తిప్పికొడుతుంది
- ఇది ఇందిరమ్మ రాజ్యం
- ఈ రాజ్యంలో పేదోళ్లకు న్యాయం జరుగుతుంది
- పదేళ్లు అధికారంలో ఉన్న వాళ్లు ఎందుకు మూసీ నది ప్రక్షాళన చేపట్టలేదు




హైదరాబాద్

ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధికి అందరూ కలిసి రావాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ సమాజానికి అంకితం ఇవ్వబోతున్నామన్నారు సీఎం రేవంత్. ఎవరెన్ని కుట్రలు చేసినా తమ ప్రభుత్వం తిప్పికొడుతుందన్నారు సీఎం రేవంత్. ఇది ఇందిరమ్మ రాజ్యమని, ఈ రాజ్యంలో పేదోళ్లకు న్యాయం జరుగుతుందన్నారు. గోదావరి ఫేజ్ 2-3 శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లడారు. గంగా నదీ, యమునా, సబర్మతీ నదులు ప్రక్షాళన చేయొచ్చని, కానీ తాము మూసీని ప్రక్షాళన చయొద్దా? అని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్న వాళ్లు ఎందుకు మూసీ నది ప్రక్షాళన చేపట్టలేదని నిలదీశారు. '1908 లో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించి నిజాం ప్రభుత్వం - మిగతా3లో



## గర్వంగా చెప్పండి.. ఇది స్వదేశీ

- జీఎస్టీ 2.0.. స్వదేశీ అని గర్వంగా చెప్పండి: ప్రధాని మోదీ
- జీఎస్టీ 2.0 సంస్కరణల గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- ప్రతి ఎంపీ తమ నియోజకవర్గంలో 20 నుంచి 30 సమావేశాలు నిర్వహించాలి
- స్థానిక వ్యాపారులు, దుకాణదారులకు జీఎస్టీ 2.0 ప్రయోజనాలు వివరించాలి.



## ఉపరాష్ట్రపతి ఎన్నికకు రెడీ

- అభ్యర్థుల బలాలు ఎలా ఉన్నాయంటే!
- ఉప రాష్ట్రపతి స్థానం భర్తీ చేసేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి.
- ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిలు పోటీ
- పార్టీలకు అతీతంగా ఎంపీలు ఓటు వినియోగించుకోవాలని విపక్ష అభ్యర్థి ప్రచారం చేయడంతో ఉపరాష్ట్రపతి ఎన్నికపై కాస్త ఉత్కంఠ



## అక్రమ నిర్బంధం: ఆ ఖైదీకి రూ. 25 లక్షల పరిహారం ఇవ్వండి

- బాధితులు.. పీడితులు.. ఎవరైనా సరే వారికి సమయాన్ని బట్టి న్యాయం అందాల్సిందే..
- తన శిక్షా కలం పూర్తయినా విడుదల కాకుండా నాలుగేళ్ల ఏడు నెలలు అదనంగా జైల్లో మగ్గిపోయిన ఒక ఖైదీకి సుప్రీంకోర్టు న్యాయం
- ఒక కేసు విషయంలో జైలు శిక్ష అనుభవిస్తున్న ఒక ముద్దాయికి న్యాయం సరిగా అందనందుకు ఏకంగా రూ. 25 లక్షల పరిహారం చెల్లించేలా ప్రభుత్వాలను సుప్రీం కోర్టు ఆదేశం




## సోషల్ మీడియా బ్యాన్‌పై నేపాల్‌లో ఆందోళనలు

- ఎనిమిది మంది మృతి.. 100 మందికిపైగా గాయాలు
- సోషల్ మీడియాపై విధించిన నిషేధం హింసకు దారి తీసింది.
- ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా వేలాదిమంది యువత రోడ్లపైకి వచ్చి నిరసన

## స్థానిక సంస్థల ఎన్నికలు మళ్లీ వాయిదా?

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలకు వెళ్లాలని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయం
- పంచాయతీ, పరిషత్ ఎన్నికలు మరింత ఆలస్యంగా జరిగే అవకాశం
- ఈ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రపతి, గవర్నర్ దగ్గర పెండింగ్‌లో బిల్లు
- బిహార్ ఎన్నికలు అయిపోయిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందట.




హైదరాబాద్

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలకు వెళ్లాలని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించింది. దీంతో పంచాయతీ, పరిషత్ ఎన్నికలు మరింత ఆలస్యంగా జరిగే అవకాశం ఉంది. ఈ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రపతి, గవర్నర్ దగ్గర బిల్లు పెండింగ్‌లో ఉంది. ఈనెల 30లోపు బిల్లులు ఎటూ తేలకపోతే.. హైకోర్టును - మిగతా3లో

# ఆపరేషన్ ఆకర్ష్‌కు శ్రీకారం



- రండి.. మా పార్టీలో చేరండి'
- త్వరలోనే నామినేటెడ్,కార్పొరేషన్ పోస్టులు భర్తీ చేస్తాం
- ఇతర పార్టీల నేతల్ని చేర్చుకునేందుకు పార్టీ తలుపులు తెరిచే ఉన్నాయంటూ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ ఆపరేషన్ ఆకర్ష్‌కు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఇతర పార్టీల నేతల్ని చేర్చుకునేందుకు పార్టీ తలుపులు తెరిచే ఉన్నాయంటూ పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో మీనాక్షి నటరాజన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరు పార్టీలోకి వచ్చినా స్వాగతిస్తామన్న ఆమె.. త్వరలోనే నామినేటెడ్,కార్పొరేషన్ పోస్టులు భర్తీ చేస్తామని సూచించారు. అయితే ఇప్పుడు మీనాక్షి నటరాజన్ చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి. ఆమె పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో చేసిన ప్రకటనల ఆధారంగా, ఇది కేవలం నేతలను చేర్చుకోవడమే కాకుండా, పార్టీలో అంతర్గత సమీకరణలను సమతుల్యం చేయడానికి కూడా ఒక వ్యూహంగా కనిపిస్తోంది. - మిగతా3లో



## మోదీని చూసి నేర్చుకోండి

- నెతన్యాహుకు ఇజ్రాయెల్ నిపుణుల సూచన
- టారిఫ్‌లు, పాకిస్థాన్‌తో ఘర్షణల సమయంలో అమెరికా విధానాలకు వ్యతిరేకంగా ప్రధాని మోదీ బలమైన వైఖరిని అనుసరించారు
- 'దేశ గౌరవం' అనేది ఓ లగ్జరీ కాదు.. ఉన్నతమైన వ్యూహాత్మక ఆస్తిగా అర్థమవుతోంది
- "ఆర్థిక, సైనిక ఉద్రిక్తతల్లో ప్రధాని మోదీ తీవ్రమైన ప్రతి స్పందన కేవలం వాటికే పరిమితం కాదు
- అది వ్యక్తిగత, దేశ గౌరవానికి సంబంధించింది.

# ఎవరి లాభం కోసం కడుతున్నరు?

- హైదరాబాద్‌కు 24 గంటలు తాగునీరు అందించే బాధ్యత మాది
- సీబీఐ విచారణకు ఆదేశించిన రేవంత్‌రెడ్డే..
- మల్లన్న సాగర్ మూసీ నదుల అనుసంధానానికి శంకుస్థాపన చేస్తుండు
- తెలంగాణను సస్యశ్యామలం చేసిన బృహత్తర ప్రాజెక్టు కాళేశ్వరం
- ఎన్నికలకు మూడు నాలుగు ఏండ్ల ముందే కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ భయంకరంగా విషం చిమ్మింది
- రాహుల్ గాంధీ అనునిత్యం విమర్శించే సీబీఐతోని కాళేశ్వరం మీద విచారణ జరిపిస్తున్నారు.



హైదరాబాద్

కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇవాళ అదే కాళేశ్వరం ప్రాజెక్టు ఆధారంగా నిర్మించిన మల్లన్న సాగర్, మూసీ నదుల అనుసంధానం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణను సస్యశ్యామలం చేసిన బృహత్తర - మిగతా3లో

# గర్వంగా చెప్పండి.. ఇది స్వదేశీ

జీఎస్టీ 2.0 పేరిట తెచ్చిన సంస్కరణలను మేక్ ఇన్ ఇండియా ప్రచారంలో భాగంగానే పరిగణించాలని.. వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఎన్డీయే ఎంపీలకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. సోమవారం ఎంపీలతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన.. ఈ మేరకు దిశానిర్దేశం చేశారు.

జీఎస్టీ 2.0 సంస్కరణల గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రతి ఎంపీ తమ నియోజకవర్గంలో 20 నుంచి 30 సమావేశాలు నిర్వహించాలి. స్థానిక వ్యాపారులు, దుకాణదారులకు జీఎస్టీ 2.0 ప్రయోజనాలు వివరించాలి.

నవరాత్రి నుంచి దీపావళి మధ్య.. స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం కోసం స్థానిక హస్తకళాకారులు, చిన్న పరిశ్రమలు పాల్గొనే స్వదేశీ ప్రదర్శనలు, జాతరలు నిర్వహించాలి. గర్వంగా చెప్పండి.. ఇది స్వదేశీ అనే నినాదంతో అన్ని రంగాల్లోనూ ఎగ్జిబిషన్లు నిర్వహించాలని సూచించారు.

అదే సమయంలో పంజాబ్ సహా దేశంలోని పలు ప్రాంతాల్లో భారీ వరదలు కారణంగా ఎన్డీయే ఎంపీల విందు కార్యక్రమాన్ని ఆయన వాయిదా వేశారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు, నేను ఉత్సవ విందు ఎలా నిర్వహించగలను? అని అన్నారాయన. ప్రజలపై పన్ను భారం తగ్గించడంతో పాటు



భారత ఎకానమీకి బూస్ట్ ఇస్తుందని భావిస్తోంది.

జీఎస్టీ 2.0 అనేది భారత ప్రభుత్వం తీసుకొచ్చిన తాజా పన్ను సంస్కరణ. ఇది 2025 సెప్టెంబర్ 22 నుండి అమలులోకి రానుంది. 2017లో ప్రారంభమైన జీఎస్టీ వ్యవస్థకు పెద్ద మార్పుగా భావించబడుతోంది.

**ప్రధాన మార్పులు:**

పాత స్లాబ్ 0%, 5%, 12%, 18%, 28% + cess

కొత్త స్లాబ్ 0%, 5%, 18%, 40% (cess తొలగింపు)

**ధరలు తగ్గిన వస్తువులు:**

అవశ్యక వస్తువులు: పన్ను 0%

పన్నీర్, చపాతీ, UHT పాలు, అవసరమైన ఔషధాలు

ప్రాముఖ్యమైన వినియోగ వస్తువులు: 5%

షాంపూ, టూత్‌పేస్ట్, హేర్ ఆయిల్, వ్యవసాయ పరికరాలు

సాధారణ వస్తువులు: 18%

TVs, ACs, వాషింగ్ మెషీన్లు, చిన్న కార్లు

లగ్జరీ %ు% హానికర వస్తువులు: 40%

పొగతాగే పదార్థాలు, పాన్ మసాలా, లగ్జరీ కార్లు

??ఆటోమొబైల్ రంగంపై ప్రభావం.. చిన్న కార్లు: %+ూ 28% ?% 18% (ధరలు తగ్గాయి). బెంజ్, టాటా, హ్యుందాయ్, రెనాల్ట్ వంటి కంపెనీలు రూ. 60,000%-10 లక్షల వరకు ధరలు తగ్గించాయి

ఇన్సూరెన్స్ పాలసీలు: జీవన, ఆరోగ్య బీమాలపై స్లాబ్ పూర్తిగా మాఫీ

పాఠశాల వస్తువులు: పెన్సిల్, షార్పెనర్, నోట్‌బుక్‌లపై పన్ను తగ్గింపు

వ్యవసాయ పరికరాలు: ట్రాక్టర్లు, డ్రిప్ ఇరిగేషన్, కంపోస్టింగ్ యంత్రాలు ు 5% %+ూ

జీఎస్టీ 2.0 లక్ష్యాల్లో ప్రధానమైంది సాధారణీకరణ. పన్ను %ంశ్రీుఎం% తగ్గించడం ద్వారా వ్యాపారులకు సులభతరం అవుతుంది. అవసరమైన వస్తువులపై పన్ను తగ్గింపుతో పాటు ఆర్థిక వృద్ధికి తోడ్పాటు, తద్వారా వినియోగం పెరగడం ద్వారా %+ఞూ% వృద్ధి చెందుతుంది. పన్ను వ్యవస్థలో స్పష్టత, పారదర్శకత కారణంగా.. వివాదాలు, విమర్శలు తొలగిపోతాయనే ఆలోచనతోనూ ఎన్డీయే ప్రభుత్వం ఉంది.

# అక్రమ నిర్బంధం: ఆ ఖైదీకి రూ. 25 లక్షల పరిహారం ఇవ్వండి

న్యాయం దక్కడం ఆలస్యం ఐతే అసలు అది న్యాయమే కాదు.. అది దక్కినట్లే కాదన్నది భారత న్యాయ సూత్రం.. బాధితులు.. పీడితులు.. ఎవరైనా సరే వారికి సమయాన్ని బట్టి న్యాయం అందాల్సిందే.. లేకుంటే వారికి జరిగే నష్టానికి ప్రభుత్వమే పరిహారం చెల్లించాల్సి ఉంటుందని గతంలో ఎన్నోసార్లు సుప్రీం కోర్టు పేర్కొంది. ఇప్పుడు అదే క్రమంలో ఒక కేసు విషయంలో జైలు శిక్ష అనుభవిస్తున్న ఒక ముద్దాయికి న్యాయం సరిగా అందనందుకు ఏకంగా రూ. 25 లక్షల పరిహారం చెల్లించేలా ప్రభుత్వాలను సుప్రీం కోర్టు ఆదేశించింది. తన శిక్షా కలం పూర్తయినా విడుదల కాకుండా నాలుగేళ్ల ఏడు నెలలు అదనంగా జైల్లో మగ్గిపోయిన ఒక ఖైదీకి సుప్రీంకోర్టు న్యాయం చేసింది. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆ నేరస్తుడికి రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 2005లో జరిగిన అత్యాచార కేసులో సోహన్ సింగ్‌కు కోర్టు జీవిత ఖైదు విధించింది. అయితే, 2017లో మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు మార్చి, సాక్ష్యాలలో లోపాలు ఉన్నందున అతని శిక్షను కేవలం 7 ఏళ్ల కఠిన కారాగార శిక్షగా తగ్గించింది. అయినప్పటికీ, హైకోర్టు ఆదేశాలను అధికారులు అమలు చేయకపోవడంతో సింగ్ జూన్ 2025 వరకు జైల్లోనే ఉండిపోయాడు. బెయిల్ కాలాన్ని పరిగణనలోకి తీసుకున్నా, అతను నాలుగేళ్ల ఏడు నెలలు ఎక్కువ శిక్ష అనుభవించినట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ జె.బి. పార్డివాలా, జస్టిస్ కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం మధ్యప్రదేశ్ రాష్ట్ర నిర్లక్ష్యాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. ఈ కేసు దర్యాప్తు



సమయంలో ప్రాసిక్యూషన్ తరపున వకీళ్లు తప్పుడు అఫిడవిట్‌లు సమర్పించడం పైనా కోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ నిర్లక్ష్యం ప్రజల ప్రాథమిక హక్కులకు భంగకరంగా వ్యాఖ్యానించింది. అలాగే, రాష్ట్రంలోని అన్ని జైళ్లను సమగ్రంగా పరిశీలించి, మరెవరూ ఇలాంటి అక్రమ నిర్బంధానికి గురికాకుండా చూడాలని మధ్యప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీకి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయన జైల్లో కోల్పోయిన జీవిత కాలాన్ని ఎవరూ తిరిగి తెచ్చివ్వలేరని పేర్కొంటూ ప్రభుత్వం ఆయనకు పరిహారం చెల్లించాల్సిందిగా ఆదేశించింది.. ఈ క్రమంలో ఆయనకు రూ. 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని మధ్య ప్రదేశ్ రాష్ట్రాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. అయితే ఈ తీర్పును ఒక మైలు రాయిగా న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. ప్రాథమిక హక్కుల పరిరక్షణ దిశగా సుప్రీం కోర్టు వేసిన అడుగు ఒక గొప్ప ముందడుగు అని వారు అంటున్నారు..

# మల్లెపూలే కాదు.. ఆస్ట్రేలియాలో వీటికీ నో ఎంట్రీ

ఇంటర్నెట్ డెస్క్: మల్లెపూలు తీసుకెళ్లినందుకు మలయాళ నటి నవ్య నాయర్‌కు ఆస్ట్రేలియాలోని విమానాశ్రయ అధికారులు రూ. 1.14 లక్షల జరిమానా విధించిన విషయం తెలిసిందే. అయితే అక్కడ పాటించే కఠినమైన నిబంధనల మేరకు కేవలం మల్లెపూలు మాత్రమే కాదు.. మనం వినియోగించే అనేక వస్తువులు, పదార్థాలపై ఆస్ట్రేలియాలో నిషేధం ఉన్నట్లు తెలుస్తోంది. వాటిని తీసుకువెళ్లిన వారికి జరిమానాతో పాటు ఒక్కోసారి జైలు శిక్ష విధించే అవకాశం కూడా ఉందట.

ఆస్ట్రేలియాలో నిషేధిత వస్తువులు, పదార్థాలు

తాజా లేదా ఎండిన పువ్వులు

పండ్లు, కూరగాయలు


మూలికలు, సుగంధ ద్రవ్యాలు, ముడి గింజలు, విత్తనాలు,

పాల ఉత్పత్తులు

బర్ఫీ, రసమలై, రసగుల్లా, దూద్‌పేడ, గులాబ్ జామున్, మైసూర్ పాక్ వంటి స్వీట్లు

బియ్యం టీ, తేనె

ఇంట్లో తయారుచేసిన ఆహారం



పెంపుడు జంతువుల ఆహారం

పక్షులు, జంతువుల ఈకలు, ఎముకలు, చర్మంతో చేసిన జాకెట్లు, బ్యాగులు, దుప్పట్లు, మూలికలు

మల్లెపూలు తీసుకెళ్లినందుకు.. నటికి రూ. 1.14లక్షల జరిమానా

**ఈ వస్తువులను తీసుకువస్తే?**

తమ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఆస్ట్రేలియా అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారు. విదేశీ ప్రయాణికులు నిషేధిత వస్తువులను తీసుకువస్తే.. వాటిని స్వాధీనం చేసుకున్న వెంటనే ధ్వంసం చేసి.. ఆ ప్రయాణికులకు జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తారు. ఒకవేళ అవి తీవ్రమైన ఉల్లంఘనలైతే ప్రయాణికుల వీసాలను సైతం రద్దు చేసే అవకాశం ఉంటుంది. అయితే ఆస్ట్రేలియాకు వెళ్లేవారు తీసుకువెళ్తున్న ఆహార పదార్థాలు, వస్తువులకు సంబంధించిన వివరాలను ముందుగానే అక్కడి అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది. ఒకవేళ అవి నిషేధిత జాబితాలో ఉంటే విమానాశ్రయం అధికారులు వాటిని జప్తు చేస్తారు. ఎటువంటి జరిమానా విధించరు. అలాకాకుండా దొంగచాటుగా లేదంటే తెలియకుండా నిషేధిత వస్తువులను తీసుకెళ్తే మాత్రం తగిన పరిణామాలు ఎదుర్కోక తప్పదు.

**నిషేధం ఎందుకంటే?**

కొన్నిరకాల ఆహార పదార్థాలు, వస్తువుల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుండడం, ప్రజలకు వివిధ రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో ఆస్ట్రేలియా ప్రభుత్వం ఇటువంటి నిబంధనలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈవిధంగా ఆస్ట్రేలియా పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది.

# ఉపరాష్ట్రపతి ఎన్నికకు రెడీ..

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి స్థానం భర్తీ చేసేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఈ పదవి కోసం ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిలు పోటీ పడుతున్నారు. సెప్టెంబర్ 9న ఎన్నిక జరగనుంది. అయితే, అధికార ఎన్డీయేకు పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. పార్టీలకు అతీతంగా ఎంపీలు ఓటు వినియోగించుకోవాలని విపక్ష అభ్యర్థి ప్రచారం చేయడంతో ఉపరాష్ట్రపతి ఎన్నికపై కాస్త ఉత్కంఠ నెలకొంది. ఉపరాష్ట్రపతి ఎన్నికలో రహస్య ఓటింగ్ విధానాన్ని అనుసరిస్తారు. రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో కూడుకున్న ఎలక్టోరల్ కాలేజీలో ఎంపీలు తమకు నచ్చిన వారికి ఓటు వేసే వెసులుబాటు ఉంటుంది. అయినప్పటికీ తమ పార్టీకే ప్రాధాన్యం ఇస్తారు. క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశమూ ఉంటుంది.

ఎన్డీయే - ఇండియా..

లోక్‌సభ 542, రాజ్యసభలో 239 సభ్యులు కలిసి మొత్తం ఎలక్టోర్‌ల సంఖ్య 781. ఇందులో ప్రతి సభ్యుడి ఓటు విలువ ఒకటిగానే ఉంటుంది. మెజార్టీ మార్కు 391. అధికార ఎన్డీయే కూటమికి ఇప్పటివరకు 422 సభ్యుల బలముంది. దీంతో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపు ఖాయంగానే కనిపిస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ (11 మంది సభ్యులు).. ఎన్డీయేకు మద్దతు ఇస్తుండడంతో మెజార్టీ పెరగనుంది. మరిన్ని పార్టీలు మద్దతు తెలిపే అవకాశం ఉంది. విపక్షాల ఇండియా కూటమికి 311 మంది బలముంది. ఇతరులు 45 మంది ఉన్నారు. వీరితో సహా కొన్ని పార్టీలు మద్దతిచ్చినా విపక్ష అభ్యర్థి విజయానికి దూరంగానే కనిపిస్తున్నారు. దీంతో పార్టీలకు అతీతంగా ఆలోచించి ఓటు వేయాలని విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇప్పటికే ఎంపీలకు విజ్ఞప్తి చేశారు.

ఇతర పార్టీలు ఎటువైపు..?

మరోవైపు ఈ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు భారత రాష్ట్ర సమితి తాజాగా ప్రకటించింది. దీంతో నలుగురు సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం లేదు. ఏడుగురు ఎంపీలున్న బిజు జనతాదళ్ ఈ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించింది. శిరోమణి అకాలీదళ్, జోరమ్ పీపుల్స్ మూమెంట్ (మిజోరం) వంటి పార్టీలకు ఒక్కో సభ్యులున్నారు. విపక్షాల అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు ఆమ్‌ఆద్మీ (10 మంది ఎంపీలు) ప్రకటించినప్పటికీ.. ఎంపీ స్వాతి మాలివాల్ ఆ పార్టీతో సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో ఆమె ఎవరికి ఓటు వేస్తారనే దానిపై స్పష్టత లేదు. స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీ సభ్యులు ఎవరివైపు మొగ్గు చూపుతారనే విషయంపై ఆసక్తి నెలకొంది.

## మోదీని చూసి నేర్చుకోండి



**ఇంటర్నెట్‌డెస్క్:** 'దేశ గౌరవం'ను వ్యూహాత్మక ఆస్తిగా ఎలా మార్చుకోవాలో భారత్‌ను చూసి ఇజ్రాయెల్ నేర్చుకోవాలని ఆ దేశ రక్షణ రంగ నిపుణులు జకి షలోమ్ పేర్కొన్నారు. మిస్‌గవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ సెక్యూరిటీలో ఆయన సీనియర్ ఫెలోగా పనిచేస్తున్నారు. 'జెరూసలెం పోస్ట్'కు రాసిన వ్యాసంలో ఆయన భారత్ వైఖరిని అభినందించారు. టారిఫ్‌లు, పాకిస్థాన్‌తో ఘర్షణల సమయంలో అమెరికా విధానాలకు వ్యతిరేకంగా ప్రధాని మోదీ బలమైన వైఖరిని అనుసరించారన్నారు. 'దేశ గౌరవం' అనేది ఓ లగ్జరీ కాదని.. ఉన్నతమైన వ్యూహాత్మక ఆస్తిగా అర్థమవుతోందన్నారు. "ఆర్థిక, సైనిక ఉద్రిక్తతల్లో ప్రధాని మోదీ తీవ్రమైన ప్రతి స్పందన కేవలం వాటికే పరిమితం కాదు. అది వ్యక్తిగత, దేశ గౌరవానికి సంబంధించింది. ఆయన ట్రంప్ నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌ను కూడా మాట్లాడేందుకు తిరస్కరించారు. దీనిని నుంచి ఇజ్రాయెల్ కొంత నేర్చుకోవాలి. ట్రంప్ నుంచి భారత్‌పై అవాంచిత కామెంట్లు వచ్చినప్పుడు ప్రధాని మోదీ వెంటనే లొంగిపోలేదు. దానికి బదులు శక్తిమంతంగా ప్రతిస్పందించి.. దేశ గౌరవాన్ని నిలబెట్టారు. అది కఠినంగా ఉన్నట్లు అనిపించినా.. తన కిందిస్థాయి దేశంగా చూడటాన్ని భారత్ అంగీకరించదనే బలమైన సందేశాన్ని పంపింది" అని షలోమ్ పేర్కొన్నారు. ఖాన్ యూనిస్‌లో నాస్సెర్ ఆస్పత్రిపై బాంబింగ్ సమయంలో ఇజ్రాయెల్ స్పందన గందరగోళంగా, ఆత్రుతతో ఉందని షలోమ్ అభిప్రాయపడ్డారు. ఫలితంగా అమాయకులను చంపామన్న సందేశం ప్రపంచ వ్యాప్తంగా వెళ్లిందని చెప్పారు. ఈ దాడిలో 20 మంది మరణించిన విషయం తెలిసిందే.

## సోషల్ మీడియా బ్యాన్‌పై నేపాల్‌లో ఆందోళనలు..



హిమాలయ దేశం నేపాల్‌లో ఘర్షణ వాతావరణం నెలకొంది. సోషల్ మీడియాపై విధించిన నిషేధం హింసకు దారి తీసింది. నేపాల్ ప్రభుత్వం ఇటీవలే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, యూట్యూబ్, స్నాప్‌చాట్ తదితర 26 సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా వేలాదిమంది యువత రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. ఖాట్మాండూలోని నేపాల్ పార్లమెంట్ వైపుకు నిరసనకారులు దూసుకెళ్లారు. అప్రమత్తమైన పోలీసులు ఆందోళనకారులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. దీంతో భద్రతా దళాలు రబ్బర్ బుల్లెట్స్‌తో కాల్పులు జరిపారు. అంతేకాదు, టియర్ గ్యాస్, వాటర్ కెనాన్స్ ప్రయోగించారు. ఈ ఘర్షణల్లో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా.. సుమారు 100 మందికిపైగా గాయపడ్డారు. పరిస్థితిని ముందే అంచనా వేసిన అధికారులు సోమవారం న్యూ బనేశ్వర్, చుట్టుపక్కల ప్రాంతాలలో కర్ఫ్యూ విధించారు. నిరసనలో పాల్గొన్న వేలాది మంది యువకులు వీధుల్లోకి రావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసనకారులు నిషేధిత ప్రాంతంలోకి చొరబడటంతో పరిస్థితి మరింత దిగజారింది. దీంతో సైన్యం రంగంలోకి దిగాల్సి వచ్చింది. మరోవైపు ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 12:30 నుండి రాత్రి 10 గంటల వరకు నగరంలో కర్ఫ్యూ విధిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## సీఎం పినరయి విజయన్ నివాసానికి బెదిరింపులు



**తిరువనంతపురం:** కేరళలో బాంబు బెదిరింపు కలకలం రేపుతోంది. ఓ అగంతకుడు రాష్ట్రంలోని ప్రముఖ ప్రాంతాల్లో బాంబుల్ని ఏర్పాటు చేసినట్లు బెదిరింపులకు దిగారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు, బాంబు స్క్వాడ్ రంగంలోకి దిగింది. సోమవారం ఉదయం కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురం జిల్లా కోర్టుకు అధికారిక ఈ-మెయిల్‌కు ఓ మెసేజ్ వచ్చింది. సీఎం పినరయి విజయన్‌తో పాటు తిరువనంతపురం జిల్లా కోర్టులో బాంబును పెట్టామనేది ఆ మెయిల్ సారాంశం. సీఎం పినరయి విజయన్ అధికారిక నివాసం,జిల్లా కోర్టులో బాంబు ఉందంటూ వచ్చిన సమాచారంతో బాంబు డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్ (బీడీడీఎస్) జాగిలాలతో మోహరించింది. కోర్టు లోపల, పరిసర ప్రాంతాలు, సీఎం అధికారిక నివాసంలో తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో ఎలాంటి బాంబులు ఇతర అనుమానాస్పద వస్తువులు లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. కోర్టు అధికారిక మెయిల్‌కు బాంబు బెదిరింపులు మెయిల్స్ పంపిన అగంతకుడిని గుర్తిస్తామని అన్నారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

**28సార్లు బాంబు బెదిరింపులు**

ఈ ఏడాదిలో ఇప్పటి వరకు కేరళ రాష్ట్రానికి 28 సార్లు బాంబు బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు చెప్పారు. సీఎం పినరయి విజయన్ అధికారిక నివాసంతో పాటు రాజ్‌భవన్,ఎయిర్‌పోర్టు,కోర్టులలో బాంబులను అమర్చామని మెయిల్స్ వచ్చినట్లు పోలీసులు అధికారికంగా విడుదల చేసిన నోట్‌లో పేర్కొన్నారు.

# ఎవరి లాభం కోసం కడుతున్నరు?

-మొదటిపేజీ తరువాయి

ప్రాజెక్టు కాళేశ్వరమన్నారు. ఎన్నికలకు మూడు నాలుగు ఏండ్ల ముందే కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ భయంకరంగా విషం చిమ్మిందని మండిపడ్డారు. అడ్డమైన అబద్ధాలతో ప్రాజెక్టును బద్నాం చేసి ప్రజలకు లేనిపోని అనుమానాలను కలిగించిందని.. ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అవే విమర్శలు, ఆరోపణలు కొనసాగిస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీజేపీ జేబు సంస్థలని విమర్శిస్తారని.. రూ.కోట్లు గంగలో కలిపి 22 నెలలు టైం పాస్ చేసి కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదన్నట్టుగా ఘోష్ కమిషన్‌తో ఏం సాధించలేకపోయారన్నారు.

### రాహుల్ విమర్శించే సీబీఐతోనే..

రాహుల్ గాంధీ అనునిత్యం విమర్శించే సీబీఐతోని కాళేశ్వరం మీద విచారణ జరిపిస్తున్నారని మండిపడ్డారు. మల్లన్న సాగర్ నుంచి నీళ్లను తీసుకొచ్చి మూసీకి పునర్ వైభవాన్ని తీసుకొస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనంతో పత్రికల్లో ప్రకటనలు ఇచ్చిందని.. సరిగ్గా వారం కింద కాళేశ్వరం మీద సీబీఐ విచారణకు ఆదేశించిన రేవంత్ రెడ్డి ఇవాళ అదే కాళేశ్వరం ప్రాజెక్టు ఆధారంగా నిర్మించిన మల్లన్న సాగర్, మూసీ నదుల అనుసంధానం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్నారన్నారు. కాళేశ్వరం, కూలేశ్వరం అని వాగిన నోటితోనే ఇవాళ అవే కాళేశ్వరం నీళ్లను హైదరాబాద్‌కు తీసుకొస్తా అని చెబుతున్నాడని.. మేం చెప్పినట్టుగానే కాళేశ్వరం తెలంగాణకు కల్పతరువు, కామధేనువు అని కాంగ్రెస్ ప్రభుత్వం ఇవాళ ఒప్పుకుందన్నారు. ఇవాళ మల్లన్న సాగర్ నుంచి మూసీకి నీళ్లు తరలించే పథకానికి శంకుస్థాపన, మొన్న కొండపోచమ్మ సాగర్ నుంచి గంధమల్లకు నీళ్లు తీసుకువచ్చే పనులకు శంకుస్థాపన అని.. కానీ తెల్లారి లేస్తే కాళేశ్వరం మీద అవాకులు, చెవాకులు, శాపనార్థాలు. ఇంతకంటే సిగ్గుమాలిన ప్రభుత్వం ఈ దేశంలో లేదని విమర్శించారు.

గండిపేటకు తీసుకువస్తుంది కాళేశ్వరం నీళ్లా కాదా? చెప్పాలి కాళేశ్వరం ప్రయోజనాలను పూర్తిగా వినియోగించుకుంటూనే దాన్ని బద్నాం చేస్తున్న ముఖ్యమంత్రి వైఖరి తల్లి పాలు తాగి రొమ్ము గుద్దే విధంగా ఉందని ధ్వజమెత్తారు కేటీఆర్. గండిపేటకు తీసుకు వస్తున్నది కాళేశ్వరం నీళ్లా? కాదా అన్న విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరాన్ని విఫల ప్రాజెక్టుగా చిత్రీకరించే ప్రయత్నం చేసినందుకు, దానిమీద కమిషన్ వేసి అట్టర్ ఫ్లాప్ అయినందుకు, మళ్లీ సీబీఐ విచారణ పేరుతో మోసం చేస్తున్నందుకు ముందుగా ముఖ్యమంత్రి ఈ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందేనన్నారు. ప్రజల సొమ్ముతో కట్టిన ప్రాజెక్టును విఫల ప్రాజెక్టుగా ఏ ముఖ్యమంత్రి కూడా చిత్రీకరించడని.. కానీ, రేవంత్ రెడ్డి తెలంగాణ పరువు తీస్తున్నాడని మండిపడ్డారు. కాళేశ్వరం అంటే ఒక బ్యారేజ్ కాదు ఒక రిజర్వాయర్ కాదు ఒక కాల్వ కాదని.. కాళేశ్వరం అంటే ఒక మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ , అనంతగిరి రిజర్వాయర్, గంధ మల్ల, బస్వాపూర్ రిజర్వాయర్ , మిడ్ మానేరు రాజరాజేశ్వర సాగర్, ఎస్సారెస్పీ పునరుజ్జీవ ప్రాజెక్టు అని చెప్పారు. మొత్తంగా కాళేశ్వరం అంటే మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు ,19 సబ్ స్టేషన్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 203 కిలోమీటర్ల సొరంగ మార్గం, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కాలువలు, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, కాళేశ్వరం అంటే 141 టీఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, సముద్ర మట్టం కంటే 530 మీటర్ల ఎత్తుకు నీళ్లను ఎత్తి పోయడమేనన్నారు.

### హైదరాబాద్‌కు 24 గంటలు తాగునీరు అందించే బాధ్యత మాది: కేటీఆర్

హైదరాబాద్ నగరం మొత్తానికి 24 గంటలు తాగునీటిని అందించే బాధ్యత మాది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ 50 కిలోమీటర్ల మేర రింగ్ మెయిన్ నిర్మాణం చేశామని పేర్కొన్నారు. రాబోయేది మన కేసీఆర్ ప్రభుత్వమే అని.. మిగతా రింగ్ మెయిన్ కూడా మేమే పూర్తి చేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ రింగ్ మెయిన్ ద్వారా గోదావరి, కృష్ణా నీళ్లు తీసుకొచ్చి హైదరాబాద్ మొత్తానికి మరో 500 ఏళ్లయినా నీటి కొరత లేకుండా చేస్తామని స్పష్టం చేశారు.

సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిన ఘటనకు కారణమైన కాంట్రాక్ట్ కంపెనీని బ్లాక్ లిస్ట్ చేయాలని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ రిపోర్ట్ ఇచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. అదే కంపెనీ నిర్మిస్తున్న ఎన్ హెచ్ 66 రహదారిలో స్లోప్ ప్రొటెక్షన్ వాల్ కూలడంతో నేషనల్ హైవే అథారిటీ ఆ కంపెనీని బ్లాక్ లిస్ట్ చేసిందని పేర్కొన్నారు. ఈ రెండు ప్రమాదాలకు కారణమైన కాంట్రాక్ట్ కంపెనీకి 7000 కోట్ల రూపాయల పనులు ఇవ్వడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. సొంత నియోజకవర్గం కొడంగల్ లో 4 వేల కోట్లతో నిర్మిస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను కూడా మంత్రి పొంగులేటి కంపెనీతో పాటు అదే ఏజెన్సీకి ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం బ్లాక్ లిస్ట్ చేసిన కాంట్రాక్ట్ కంపెనీ, ముఖ్యమంత్రి నిర్వహిస్తున్న మున్సిపల్ శాఖలో భాగమైన హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ బ్లాక్ చేసిన కంపెనీని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు బ్లాక్ లిస్టు చేయడం లేదు. ఇది క్రిమినల్ కుట్ర కాదా? అని నిలదీశారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై వేల కోట్ల రూపాయలను దోచుకొని ఢిల్లీకి మూటలు పంపి, వాటాలు పంచి తన సీఎం కుర్చీని కాపాడుకోవడానికే రేవంత్ రెడ్డి ఇదంతా చేస్తున్నాడని ఆరోపించారు. ఒకేసారి 1,50,000 కోట్లను దోచుకోకుండా విడతల వారీగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ కంపెనీలకు మూసీ సుందరీకరణ ప్రాజెక్టును అప్పగించాలని రేవంత్ రెడ్డి ఆత్రంగా ఉన్నాడని కేటీఆర్ అన్నారు. కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇవ్వడానికి, మహిళలకు నెలకు 2500 ఇవ్వడానికి, యువతకు స్కూటీలు ఇవ్వడానికి, ముసలి వాళ్లకు 4000 పెన్షన్ ఇవ్వడానికి మాత్రం రేవంత్ రెడ్డి ఆత్రం చూపించడం లేదని విమర్శించారు. అక్కడైతే కమీషన్లు రావని భావిస్తున్నారా అని ఎద్దేవా చేశారు. 16 వేల కోట్ల రూపాయలతో అయిపోయే మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంచనాలను లక్షా యాభై వేల కోట్లకు పెంచి లూటీ చేయాలని చూస్తున్నారని అన్నారు. ఇంకో 500 సంవత్సరాల పాటు హైదరాబాద్‌కుకి తాగునీటి కొరత రాకుండా చూసే బాధ్యత కేసీఆర్‌ది.. బీఆర్ఎస్ ది అని స్పష్టం చేశారు. ఇందుకోసం బీఆర్ఎస్ హయాంలో ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ 50 కిలోమీటర్ల మేర రింగ్ మెయిన్‌ను నిర్మించామని తెలిపారు. మళ్లీ అధికారంలోకి వచ్చాక దాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. మేం అధికారంలోకి వచ్చాక 24 గంటలు హైదరాబాద్‌లో నల్లా నీళ్లు వచ్చేలా చూస్తామని అన్నారు. ఈ ముఖ్యమంత్రికి అది చేతకాదని విమర్శించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత ఉచిత తాగు నీటి పథకాన్ని కూడా కాంగ్రెస్ రద్దు చేస్తుందని అన్నారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్కాములపై ప్రశ్నిస్తే మాట్లాడటం లేదని.. దీనిపై బీజేపీని అడిగితే వాళ్లు కూడా మాట్లాడటం లేదని కేటీఆర్ తెలిపారు. ఆర్ఆర్ టాక్స్ వసూలు చేస్తున్నారని సాక్షాత్తు ప్రధానమంత్రి ఆరోపించినా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో బీజేపీ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ కు పూర్తిస్థాయిలో న్యాయం చేసేలా గోదావరి రింగ్ మెయిన్ ప్రాజెక్టును, మూసీ సుందరీకరణ పూర్తి చేసేది కేసీఆర్.. బీఆర్ఎస్ పార్టీనే అని స్పష్టం చేశారు.

### రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలు ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలి.. కేటీఆర్ డిమాండ్

కాళేశ్వరం ప్రాజెక్టుపై చిల్లర ప్రచారం చేస్తున్నందుకు రేవంత్‌తో సహా కాంగ్రెస్ నేతలు ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన సోమవారం పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోని అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరమన్నారు. కాళేశ్వరంతో ఇప్పటిదాకా 240 టీఎంసీల నీటి వినియోగం జరిగిందని.. 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిందన్నారు. 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా మేడిగడ్డ బ్యారేజీ కొట్టుకపోలేదు నిక్షేపంలా ఉందని.. మీరేమో (కాంగ్రెస్) కూలిపోయిందని అబద్దాలు చెపుతున్నారని మొన్న అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఓవైసీ ఎత్తిచూపారని.. 20 నెలలుగా బ్యారేజీలు ఎందుకు రిపేరు చేయడం లేదని కూడా అక్బరుద్దీన్ ప్రశ్నించారని గుర్తు చేశారు. మొదటినుంచి లక్ష కోట్ల అవినీతి అని కాళేశ్వరంపై కాంగ్రెస్‌లోని ప్రతి ఒక్కరూ తప్పుడు ప్రచారం చేశారన్నారు.

### లక్ష కోట్ల కుంభకోణం ఎలా..?

రూ.94 వేల కోట్ల ఖర్చు చేసిన ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల కుంభకోణం ఎలా జరుగుతుంది? కేటీఆర్ నిలదీశారు. ఇదంతా రాజకీయ ఆరోపణ అని రేవంత్ రెడ్డికి పిల్లనిచ్చిన మామ పద్మారెడ్డి కొట్టిపారేసినా ఇంకా ముఖ్యమంత్రికి బుద్ధి రావడం లేదన్నారు. రూ.4000 కోట్ల నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీలో భూసేకరణ, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అయిన వ్యయాన్ని తీసేస్తే 85 పిల్లర్లు ఉన్న బ్యారేజీ సిమెంట్ స్ట్రక్చర్ నిర్మాణానికే సుమారు రూ.2000 కోట్లు ఖర్చు అయ్యాయని.. కుంగిన మూడు పిల్లర్లు, ఏడవ బ్లాక్‌ను మాత్రం పునర్నిర్మాణం చేస్తే సరిపోతుందని.. ఈ విషయం ఎన్డీఎస్ఏ రిపోర్ట్‌లో కూడా స్పష్టంగా ఉందన్నారు. ఆ ఒక్క ఏడవ బ్లాకు నిర్మాణానికి రూ.250 నుంచి రూ.300 కోట్లు ఖర్చయ్యిందని.. ప్రభుత్వం నుంచి రూపాయి తీసుకోకుండా తామే సొంతంగా ఆ బ్లాకును పునర్నిర్మిస్తామని ఎల్ అండ్ టీ కంపెనీ చెప్పినా కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇందులో ప్రజాధనం ఎక్కడ వృథా అయ్యిందన్నారు. బనకచర్ల ప్రాజెక్టు కోసమే మేడిగడ్డ బరాజ్ ను రిపేర్ చేయించకుండా నీళ్లను కిందికి వృథాగా వదులుతున్నారని ఆరోపించారు.

### అబద్ధాలు ప్రచారం చేసినందుకు క్షమాపణలు చెప్పాలి..

రూ.94వేల కోట్ల ప్రాజెక్టులో 250 కోట్లు నష్టం జరిగితే, ఆ డబ్బుల్ని కూడా తామే సొంతంగా పెట్టుకుంటామని ఏజెన్సీ ముందుకు వస్తే పట్టించుకోకుండా లక్ష కోట్ల కుంభకోణం అని అబద్ధాలు ప్రచారం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముక్కు నేలకు రాసి రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 17 మే 2023 నాడు జరిగిన క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కేవలం రూ.1100 కోట్ల ఖర్చుతో గోదావరి జలాలను హైదరాబాద్‌కు తీసుకొచ్చే పథకానికి రూపకల్పన చేశారని.. సముద్ర మట్టానికి 618 మీటర్ల ఎత్తులో కొండపోచమ్మ సాగర్ ఉంటే, 560 మీటర్ల ఎత్తులో మల్లన్న సాగర్ ఉంటుందని.. 540 మీటర్లు ఎత్తులో గండిపేట చెరువు ఉంటుందన్నారు. కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు గోదావరి జలాలను గ్రావిటీ ద్వారానే తేవొచ్చని.. అయితే గోదావరి, మూసీ అనుసంధానికి కొండపోచమ్మ సాగర్ సోర్స్ ని ఎందుకు తీసేసారో తెలియదు? లోగుట్టు పెరుమాళ్ళకే ఎరుక అన్నారు. రూ.1100 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును ఇవాళ రూ.7390 కోట్లకు పెంచారు అంటే దాదాపు ఏడు రేట్లు పెంచారు. ఎవరికోసం? ఎందుకోసం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### ఎవరి లాభం కోసం కడుతున్నరు..?

రూ.1100 కోట్లతో కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి జిల్లాలను తీసుకొచ్చి రావల్ కోల్ చెరువును నింపి అక్కడి నుంచి గండిపేటకు గ్రావిటీ ద్వారా తీసుకురావొచ్చని.. కానీ రేవంత్ ప్రభుత్వం మాత్రం ఈ ప్రాజెక్టు పేరు చెప్పి మూడు నీటి శుద్ధి కేంద్రాలు, ఐదు పంప్ హౌస్‌లను కడుతుందని నిలదీశారు. ఎవరి లాభం కోసం కడుతున్నారు? కమీషన్లు దండుకోవడానికా? కాంట్రాక్టర్లకు దోచిపెట్టడానికా? ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. ఖజానాలో పైసలు లేక పథకాలు అమలు చేయడం లేదని చెప్తున్న రేవంత్ రెడ్డి మరోవైపు ప్రజాధనాన్ని దండుకుంటున్నాడని.. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు రెండు లక్షల కోట్లు అని మొన్న పార్లమెంట్‌లోనే కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా చెప్పినా.. సిగ్గు లేకుండా మొన్న అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు రూ.8లక్షల కోట్లు, రూ.7లక్షల కోట్ల అప్పు అని నోటికి వచ్చినట్లు వాగారన్నారు. సంక్షేమ పథకాలు అమలుకు పైసలు లేవని చెప్తున్న ప్రభుత్వం రూ.7400 కోట్ల ప్రాజెక్టుకు అర్జెంటుగా శంకుస్థాపన ఎందుకు చేస్తుందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిన ఘటనకు కారణమైన కాంట్రాక్ట్ కంపెనీని బ్లాక్ లిస్ట్ చేయండి అని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ రిపోర్ట్ ఇచ్చిందని.. అదే కంపెనీ నిర్మిస్తున్న ఎన్ హెచ్ 66 రహదారిలో స్లోప్ ప్రొటెక్షన్ వాల్ కూలడంతో నేషనల్ హైవే అథారిటీ ఆ కంపెనీని బ్లాక్ లిస్ట్ చేసిందని.. ఈ రెండు ప్రమాదాలకు కారణమైన కాంట్రాక్ట్ కంపెనీకి రూ.7000 కోట్ల పనులు ఇవ్వడాన్ని ఎలా అర్థం చేసుకోవాలన్నారు.

## తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**హైదరాబాద్:** బ్యారేజీల భద్రత, వినియోగాన్ని నిర్ధరించేందుకు వర్షాకాలం ముందే చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తుమ్మిడిహట్టి కోసం సవరించిన డీపీఆర్, ముసాయిదా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, మహారాష్ట్రతో చర్చల కోసం షెడ్యూల్ ఖరారు చేయాలని అధికారులకు సూచించారు. నీటిపారుదలశాఖ అధికారులతో ఉత్తమ్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. సమ్మక్క- సారక్క ఆనకట్ట విషయంపై ఈ నెల 23న టీఏసీ సమావేం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నివేదిక సమర్పించడంతోపాటు ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ కోసం ప్రయత్నించాలని అధికారులకు సూచించారు. పీఎంకేఎస్‌వై పథకం ద్వారా నిధుల కోసం కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణలో ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారం ముందుకెళ్తామని అన్నారు. వరద తగ్గిన వెంటనే ఐఐటీ లాంటి సంస్థలతో పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. “పాలమూరు, రంగారెడ్డి, జూరాల, కల్వకుర్తి ప్రాజెక్టులను ప్రాధాన్యంగా పరిగణించాలి. 4 ప్రాజెక్టుల భూ సేకరణ, పునరావాసం, అటవీ అనుమతులు, పెండింగ్ సమస్యలపై దృష్టి సారించాలి. డిండి, ఎస్ఎల్‌బీసీ, పెండ్లిపాక, నక్కలగండి, కొడంగల్–నారాయణపేట ప్రాజెక్టుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. భూసేకరణ వేగవంతం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. దేవాదుల ప్రాజెక్టు 3, 6 ప్యాకేజీల పనులు వేగవంతం చేయాలి. తదుపరి కేబినెట్ సమావేశానికి పురోగతి నివేదిక సమర్పించాలి. అన్ని ప్రాజెక్టుల్లో దశలవారీగా పూడికతీతకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి” అని ఉత్తమ్ సూచించారు. మరోవైపు ఎస్ఎల్‌బీసీ పనుల కోసం హెలిబోర్న్ సర్వే విషయంపై ఎన్జీఆర్ఐ, హిమాలయన్ హెలీ సర్వీసెస్, జేపీ అసోసియేట్స్ ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృశ్యమాధ్యమ సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ వద్ద 2 హెలిప్యాడ్‌లను సర్వే కోసం ఉపయోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. డీజీసీఏ, ఇతర అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. క్షేత్రస్థాయి అధ్యయనాలు కొనసాగించాలన్నారు.

## రండి.. హైదరాబాద్‌ను అభివృద్ధి చేద్దాం

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ ప్రజలను వరదల నుంచి కాపాడింది. వందేళ్లకు పైగా ఈ నగరానికి తాగు నీరు అందుతున్నాయంటే ఆనాటి నిజాం సర్కార్ దూరదృష్టినే కారణం. కోటికిపైగా జనాభా ఉన్న హైదరాబాద్ నగరానికి తాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎంతో కృషి చేశాయి. 1965 లో మంజీరా నది నుంచి నగరానికి తాగు నీరు అందించింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం. 2002 లో కృష్ణా నదీ జలాలను మూడు దశల్లో నగరానికి తరలించి ప్రజల దాహార్తిని తీర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలది. కాంగ్రెస్ తెచ్చిన గోదావరి జలాలను నెత్తి మీద చల్లుకుని తామే ఏదో చేసినట్టు కొందరు నమ్మించారు. నెత్తిమీద నీళ్లు చల్లుకున్నంత మాత్రాన వాళ్ల పాపాలు తొలగిపోవు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాతే గోదావరి జలాల తరలింపునకు ముందడుగు పడింది. కాలుష్యమయమైన మూసీతో నల్లగొండ జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషతుల్యమైన మూసీని ప్రక్షాళన చేస్తానని నల్లగొండ జిల్లా ప్రజలకు ఆనాడే మాట ఇచ్చా. 20 టీఎంసీల గోదావరి జలాలను హైదరాబాద్‌కు తరలించబోతున్నాం. ఇందులో 16 టీఎంసీలను హైదరాబాద్ తాగునీటి కోసం వినియోగించబోతున్నాం. చెరువులను నింపుకుంటూ 4 టీఎంసీలను మూసీకి తరలించి మూసీని ప్రక్షాళన చేస్తాం. శ్రీపాద ఎల్లంపల్లి నుంచే గోదావరి జలాలను హైదరాబాద్ తరలిస్తున్నాం. ఆ సంగతి మరిచిపోయి కొందరు మల్లన్నసాగర్ అని మాట్లాడుతున్నారు. చేవెళ్లలో వైఎస్ ప్రారంభించిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాసుల కక్కుర్తితో తలను తొలగించింది మీరు కాదా?, చేవెళ్ల, తాండూరు, పరిగికి సాగునీరు అందకపోవడానికి కారణం మీరు కాదా?, తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాణహిత చేవెళ్ల కట్టి ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల రైతులకు సాగునీరు అందిస్తాం’ అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు మళ్లీ వాయిదా?

-మొదటిపేజీ తరువాయి

ఆశ్రయించి ఎన్నికలకు మరింత గడువు కోరే యోచనలో ప్రభుత్వం ఉంది. బిహార్ ఎన్నికలు అయిపోయిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందట. ఇందుకోసం హైకోర్టును రెండు నుంచి మూడు నెలల గడువు అడిగాలని చూస్తోందట. కాగా, ఆగస్టు 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కేబినెట్ భేటీ అయింది. స్థానిక ఎన్నికల రిజర్వేషన్లలో పరిమితి ఎత్తివేయాలని కేబినెట్ నిర్ణయించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం పేర్లను గవర్నర్‌కు సిఫార్సు చేసింది.

## ఆపరేషన్ ఆకర్ష్‌కు శ్రీకారం

-మొదటిపేజీ తరువాయి

ఇందుకోసం పార్టీలోని నేతలను మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారు, ఎన్నికల ముందు ఇతర పార్టీల నుంచి వచ్చినవారు, అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో చేరినవారు ఇలా మూడు వర్గాలుగా విభజించారు. వాటి ఆధారంగా పదేళ్లుగా పార్టీలో ఉన్నవారికి ప్రాధాన్యత, కేటగిరీల వారీగా నామినేటెడ్ పదవుల భర్తీ జరుగుతుంది. అంటే పార్టీలో ఉన్న కాలం, నిబద్ధత ఆధారంగా అవకాశాలు కల్పించనున్నారు.

## రాహుల్ గాంధీ ప్రధాని కావడం దేశానికి అవసరం: భట్టి విక్రమార్క



**హైదరాబాద్:** రాహుల్ గాంధీ ప్రధాని కావడం దేశానికి చాలా అవసరమని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని పార్టీ నేతలను ఉద్దేశించి మాట్లాడారు. అందరం కలిసికట్టుగా పనిచేసి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. “ఎన్నికల ముందు పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ లేదా ప్రభుత్వ పదవిలో ఏదో ఒకటి తప్పకుండా వస్తుంది. కాంగ్రెస్ పార్టీ అజేయంగా ఉండేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేపట్టే ప్రతి పనికి సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కేబినెట్ అంతా అండగా ఉంటుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందించేందుకు, సవాళ్లను ఎదుర్కొని న్యాయం చేసేందుకు ముందుకు వెళు_న్నాం. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ పరిమితిని భారత రాష్ట్ర సమితి పెట్టింది. 42 శాతం రిజర్వేషన్ బిల్లును భాజపా రాష్ట్రపతి దగ్గర ఆపింది. ఈ విషయంలో భారత రాష్ట్ర సమితి, భాజపా కుట్ర దాగి ఉంది”అని భట్టి విమర్శించారు.

## ఆ క్రెడిట్ సీఎం రేవంత్‌రెడ్డిదే.. రాజాసింగ్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



**హైదరాబాద్ :** భాగ్యనగరంలో గణేశ్ నిమజ్జనం చాలా ప్రశాంతంగా పూర్తి అయిందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యానించారు. పోలీస్, మున్సిపల్, నీటి శాఖ, ట్రాఫిక్ శాఖ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిమజ్జన కార్యక్రమానికి బాగా సహకరించారని తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు రాజాసింగ్. ట్యాంకుబండ్‌పై జరిగిన వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గరుండి నిరంతరం పర్యవేక్షించారని.. ఈ క్రెడిట్ ఆయనకే దక్కుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కొన్ని సూచనలు చేశారు రాజాసింగ్. వినాయక్ సాగర్ నీరు మురికిగా ఉందని.. దురదృష్టవశాత్తూ దేవుళ్ల నిమజ్జనాలను కూడా ఆ నీటిలోనే చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు రాజాసింగ్. ఇలా చేస్తే పాపం చేస్తున్నట్లు అవుతోందని చెప్పుకొచ్చారు. వినాయక్ సాగర్ నీటిని పరిశుభ్రం చేస్తానని మాజీ సీఎం కేసీఆర్ కూడా గతంలో చెప్పారని గుర్తుచేశారు. వినాయక్ సాగర్‌లోకి మురికి కాలువ నీరు వస్తోందని.. ఆ నీటిని మళ్లించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. వినాయక్ సాగర్‌ను వర్షపు నీటితో నింపాలని సూచించారు. రాబోయే ఏడాది వినాయక్ సాగర్‌లో చేసే గణనాథుల నిమజ్జనాలను మంచి వర్షపు నీటిలో చేయాలని సూచించారు. ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు. ఇలా చేస్తే రేవంత్‌రెడ్డికి, గణేష్ భక్తులందరికీ తప్పకుండా స్వామివారి ఆశీర్వాదం లభిస్తుందని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

## ప్రపంచాన్ని కుదిపేసిన వివేకానంద 'చికాగో ప్రసంగం'

11 సెప్టెంబర్ 1893 రోజున విశ్వ సర్వమత మహా సమ్మేళనంలో (పార్లమెంట్ ఆఫ్ ది వరల్డ్స్ రిలిజియన్స్) భారతీయ వేదాంతి స్వామి వివేకానంద ప్రసంగం ప్రపంచ మత పెద్దలందరినీ ఆశ్చర్యచకితులను చేసింది. "మిస్టర్ అండ్ మిసెస్" అంటూ ప్రారంభమయ్యే మత పెద్దల ప్రసంగాల నడుమ, స్వామి వివేకానంద ప్రసంగం ప్రారంభిస్తూ "డియర్ అమెరికన్ బ్రదర్స్ అండ్ సిస్టర్స్" అని ఆంగ్లంలో సంభోదించడంతో విశ్వ మత సమ్మేళన ప్రాంగణంతో పాటు చికాగో మహా నగరం అంతా కరతాళ ధ్వనులతో కొన్ని నిమిషాల పాటు మారుమోగింది. భారతీయ ఆధ్యాత్మిక వారసత్వంతో పాటు వేదాంత తత్వాలను ప్రపంచానికి పరిచయం చేసి ప్రపంచ మానవాళి మనసులను గెలుసుకోవడంలో విజయం సాధించిన వివేకానంద ప్రతిభకు గుర్తుగా 9/11 రోజున "దిగ్విజయ దినోత్సవం (దిగ్విజయ్ దివస్)" పాటించడం ఆనవాయితీగా మారింది. స్వామి ప్రసంగం ఆసాంతం విశ్వ మానవాళి అంతటికీ ప్రధానంగా ఒకే మతం ఉండాలని, అది మానవీయత అనే మతం కావాలని కోరడం, ప్రపంచ జనాభా మొత్తం విశ్వ కుటుంబంలో సభ్యులు మాత్రమే అని తెలుసుకోవాలని వివరించడం వసుదైక కుటుంబ భావనకు ఊపిరి పోయింది. అమెరికాతో పాటు ప్రపంచ మానవాళి నీరాజనం పలికిన వివేకానంద ప్రసంగం "మానవ శాంతియుత సహజీవనానికి, పరమత సహనశీలతకు పునాదులు వేసేది" మాత్రమే మతం అని ఉద్ఘాటించారు. భారతీయ హిందూ ధర్మం అన్ని మతాలను సముచితంగా గౌరవిస్తుందని, అన్ని మతాల గమ్యాలు మానవీయతను మాత్రమే బోధిస్తున్నాయని, హిందూ మత సహృదయాన్ని ఆవిష్కరించిన మహా ప్రసంగం అది. వివేకానందుడి విజ్ఞాన వివేక వాక్పటిమ, విలక్షణ వ్యక్తిత్వం, హిందూ ధర్మం పట్ల లోతైన అవగాహన, నిజాయితీతో కూడిన బోధనలు విశ్వ మత మహా సమ్మేళనంలో పాల్గొన్న మత ప్రతినిధులకు కనువిప్పుగా నిలిచాయని నాటి అమెరికా పత్రికలన్నీ ప్రశంసించడం ఓ అద్భుత సందర్భం. భారతీయ ఆత్మ, రుషుల ప్రతిధ్వని, సద్గురువు రామకృష్ణ పరమహంస స్వరం, నాగరికత పునరుజ్జీవన అవసర ఆవేదన, ప్రపంచ మానవాళి పట్ల సామరస్యం, మానవీయ తత్వాలను ఆవిష్కరించిన ఏకైక అద్భుత చికాగో ప్రసంగంగా ఖ్యాతి గాంచింది. హిందూ సూక్తులు, భగవద్గీత శ్లోకాలను ప్రస్తావన చేస్తూ మానవులు భగవంతుడిని చేరుకోవడానికి అసలైన మార్గాలను తన ప్రసంగంలో వివరించారు వివేకానంద స్వామి. సర్వమతాలకు, అన్ని దేశాలకు చెందిన శరణార్థులను, పీడిత మానవాళిని తన అక్కున చేర్చుతున్న భారతదేశ పౌరుడిగా తను గర్వపడుతున్నానని స్వామి గంభీరంగా ప్రసంగాన్ని కొనసాగించడం అందరిని ఆనంద డోళికల్లో ముంచి వేసింది. ఒకరి మతం గొప్పది, మరొకరి మతం చిన్నది అంటూ విభజన ఏదీ లేదని గుర్తు చేస్తూనే అన్ని మతాలు ఒకే విధంగా సహనశీలతను, సత్య మార్గాన్ని ఉద్భోదిస్తున్నాయని గుర్తు చేయడం విశేషం. ప్రపంచంలో ప్రవహిస్తున్న అన్ని నదుల గమ్యస్థానం సముద్రమే అని గుర్తు చేస్తూ, అన్ని మతాల బోధనలు మానవీయ సముద్రంలోనే కలవాలంటూ గీతాసారాన్ని స్పష్టంగా వివరించారు. మతాభిమానం ముదిరి దురభిమానంగా మారితే అశాంతి మొలుస్తుందని, హింస ప్రేరేపించబడుతుందని అన్నారు. మతం మూర?త్వంగా మారకూడదని నొక్కివక్కానించారు. మత విభేధాలు రక్తం చిందించకూడదని, మత పరమత అసహనాలు ప్రపంచ శాంతి పావురాన్ని గాయపరుస్తాయని గుర్తు చేసారు. సెప్టెంబర్ 09, 2001 రోజున అల్-ఖైదా ఉగ్రవాద ఆత్మాహుతి దళం అమెరికాలోని న్యూయార్క్ నడిబొడ్డున నిర్మితమైన వరల్డ్ ట్రేడ్ సెంటర్ 110 అంతస్తుల ట్విన్ టవర్స్‌ను నాలుగు విమానాలతో విస్ఫోటన దుర్ఘటనకు పాల్పడడంతో రెండు టవర్స్ పేకమేడల్లా కుప్పకూలి పోవడంతో 2,996 వరకు సామాన్యులు ప్రాణాలు కోల్పోవడంతో పాటు దాదాపు 25,000 మంది గాయపడడంతో ప్రపంచమంతటా ఒక్కసారి ఉలిక్కిపడింది, అమెరికా దిమ్మ తిరిగింది. తీవ్రవాదులు లక్ష్యంగా చేసుకున్న పెంటగన్, యూఎస్ క్యాపిటల్ బిల్డింగులు మాత్రం ఉగ్ర విస్ఫోటనాల నుంచి తప్పించుకోగలిగాయి. సెప్టెంబర్ 11, 1893 రోజున విశ్వ శాంతికి సర్వ మతాలు బాటలు వేయాలన్నా వివేకానంద చికాగో ప్రసంగం ఒక వైపు, సెప్టెంబర్ 11, 2001 రోజున ట్విన్ టవర్స్ కూల్చి వేత మరో వైపు చరిత్ర పుటల్లో నిలిచి పోయాయి. ఎప్పటికైనా ఉగ్ర ఒసామాలు ఓడాల్సిందే అని, విశ్వ శాంతికి మానవీయ బాటలు వేయమన్న వివేకానందుల బోధనలు విజయం సాధించాల్సిందే అని గుర్తుంచుకోవాలి. భారతీయ ఆధ్యాత్మిక హృదయాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరించిన స్వామి వివేకానంద ప్రసంగం ప్రపంచ శాంతికి దారి దీపంగా నిలవాలని కోరుకుందాం. పరమత సహనమే మన నినాదమని ఏకరువు పెడదాం.

# మానసిక ఆరోగ్యాలతో సతమతమవుతున్న ప్రపంచం!



ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ కన్న ఎక్కువగా, అనగా దాదాపు 12 శాతం ప్రజలు మానసిక ఆరోగ్య (మెంటల్ హెల్త్ డిసార్డర్స్) రుగ్మతలతో సతమతం అవుతున్నారని , దీని వల్ల కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతూ, పేదరికం పెరుగుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ, డబ్ల్యూహెచ్ఓ తాజా నివేదిక స్పష్టం చేస్తున్నది. "ప్రపంచ ప్రస్తుత మానసిక ఆరోగ్యం (వరల్డ్ మెంటల్ హెల్త్ టుడే)" అనే నివేదికతో పాటు "మానసిక ఆరోగ్య అట్లాస్ 2024(మెంటల్ హెల్త్ అట్లాస్ 2024)" అనే పేరుతో తాజాగా విడుదలైన నివేదికల రూపంలో పలు గంభీరమైన మానసిక ప్రజారోగ్య అంశాలు బయట పడ్డాయి. మానసిక అనారోగ్యాలకు ప్రధాన కారణాలుగా ఆందోళన (ఆంగ్జైటీ), నిరాశ (డిప్రెషన్) విష వలయంలో చిక్కిన అభాగ్యులు, ముఖ్యంగా యువత, మానసిక రుగ్మతలకు లోనవుతున్నారని నివేదిక బహిర్గతం చేయడం కొంత కలవరానికి కారణం అవుతున్నది. నేడు అనేక ప్రపంచ దేశాలు మానసిక అనారోగ్యాలకు సరైన సమాధానంగా పలు పథకాలు, పాలసీలు, నిధుల కేటాయింపు చేయడం కొనసాగుతున్నాయి. అన్ని వయస్సుల ప్రజలు, ఆదాయ వర్గాలు, అన్ని దేశాలు, స్త్రీ పురుషులు కూడా మానసిక ఆరోగ్య రుగ్మతల వలలో చిక్కడం గమనించారు. రెండవ అతి పెద్ద దీర్ఘకాలిక ప్రజారోగ్య సమస్యగా మానసిక అనారోగ్య రుగ్మతలు అవతరించడం వల్ల మానవాళి శ్రేయస్సుకు భంగం కలగడం గమనించారు. నేటి డిజిటల్ యుగపు జనాభాకు మానసిక ఆరోగ్య సవాళ్లు రోజు రోజుకు పెరగడంతో సత్వరమే ప్రజారోగ్య పరిరక్షణకు పెట్టుబడులు పెంచడం వల్ల కుటుంబ పౌర సమాజ ఆరోగ్యం కుదుట పడుతుందని నివేదిక అంచనా వేస్తున్నది. మానసిక ఆరోగ్యంపై పెట్టుబడి అంటే ప్రజారోగ్యంపై పెట్టుబడి అని భావించాలని ఐరాస నివేదిక సారాంశంగా తెలుపుతున్నది. మానసిక ఆరోగ్యం ప్రతి ఒక్కరి కనీస మౌళిక హక్కు అని తెలుసుకోవాలి. మానసిక రుగ్మతలకు చికిత్స అందించని యెడల అవి ముదిరిపోయి చివరకు ఆత్మహత్యలు కూడా పెరుగుతాయని హెచ్చరిస్తున్నారు. 2021లో ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో 7.27 లక్షలు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఈ సమస్య యువతలో మరింత అధికంగా ఉన్నట్లు గమనించారు. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు–2030 అంచనాల ప్రకారం 2030 నాటికి కనీసం 33 శాతం వరకు ఆత్మహత్యలు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ప్రస్తుతం పరిణామాల అధ్యయనం ప్రకారం 12 శాతం వరకు మాత్రమే కట్టడి చేయగలిగే స్థాయికి చేరవచ్చని నివేదిక పేర్కొనడం అన్ని దేశాలకు ఒక తీవ్రమైన హెచ్చరికను చేసినట్లు అవుతున్నది. మానసిక రుగ్మతల్లో ఆందోళన, నిరాశ లాంటివని ప్రధానంగా మానవాళినా పట్టి పీడిస్తున్నాయని గమనించారు. మానసిక అనారోగ్యాల వల్ల పరోక్షంగా కుటుంబాలపై ఆర్థిక భారం పడడం, ఆ వ్యక్తులు తమ వృత్తిపరమైన పనులను చేసుకోకపోవడంతో ఆయా కుటుంబాల్లో పేదరికం పెరగడం జరుగుతోంది. మానసిక రుగ్మతల చికిత్స, నివారణలకు సత్వరమే సుస్థిర పెట్టుబడులు పెట్టడం, అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం, అనేక సంస్థలు కలిసి సమన్వయంతో పని చేయడం, మానసిక రుగ్మతల పట్ల అపోహలు తొలగించడం, వీటికి కారణమైన మూలాలను వెతికి పట్టుకోవడం నిరంతరం జరగాలని నివేదిక సూచిస్తున్నది. గత దశాబ్దకాలంగా ప్రభుత్వాలు కేటాయిస్తున్న మొత్తం ప్రజారోగ్య నిధుల్లో కేవలం 2 శాతం మాత్రమే మానసిక రుగ్మతల కట్టడికి వినియోగిస్తున్నట్లు గమనించారు. అమెరికా ఒక్కొక్కరిపై 65 డాలర్లు మానసిక రుగ్మతల కట్టడికి కేటాయిస్తే, అత్యల్ప ఆదాయ దేశాలు కేవలం సగటుల తలసరి 0.04 డాలర్లు మాత్రమే కేటాయించడం సమస్య గంభీరతను స్పష్టం చేస్తున్నది. మానసిక వైద్యులను సంప్రదించడానికి మఆనసిక రోగులు ముందుకు రాకపోవడం పెద్ద సమస్యగా కనిపిస్తున్నది. అల్పాదాయ దేశాల్లో కేవలం 10 శాతం మానసిక రోగులు చికిత్సలు పొందగలుగుతున్నారని, అభివృద్ధి చెందిన దేశాల్లో 50 శాతం మానసిక రోగులు చికిత్సలకు చొరవ చూపుతున్నట్లు గమనించారు. మానసిక ఆరోగ్య పరిరక్షణకు చిన్న పిల్లలు, పాఠశాలలు, కళాశాలల్లో మానసిక ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పవలసిన అవసరాన్ని గుర్తించాలని నివేదిక వివరిస్తున్నది. కొన్ని దేశాల్లో 2020లో 39 శాతం మాత్రమే మానసిక ఆరోగ్య కేంద్రాలు పని చేయగా, నేడు అవి 80 శాతం వరకు పెరగడం కొంత ఊరటను కలిగిస్తున్నది. నేటి డిజిటల్ స్మార్ట్ సమాజంలో మానసిక ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెట్టుబడులను భారీగా పెంచడం, అన్ని స్థాయిల్లో మానసిక ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పడం, చట్టబద్దంగా మానసిక రోగులకు కనీస హక్కులు కల్పించడం, సుస్థిర నిధుల కేటాయింపు, పౌర సమాజ–ఆధార మానసిక ఆరోగ్య కేంద్రాల విస్తరణ, వ్యక్తి–ఆధార మానసిక ఆరోగ్య భద్రతలకు ప్రాధాన్యం ఇవ్వాలని డబ్ల్యూహెచ్ఓ సూచిస్తున్నది. ఈ హెచ్చరికలను పెడచెవిన పెడితే మానసిక ఆరోగ్య రుగ్మతలు విపత్తు వలె మారి పౌర సమాజం, కుటుంబాలు అనారోగ్య అయోమయంలో మునిగి జీవితాలు ఆత్మహత్యల వరకు చేరవచ్చని తెలుసుకుందాం. ఆత్మహత్యలు లేని ప్రపంచాన్ని నిర్మించుకుందాం.

# ఇంజనీరింగ్ శిఖరం వేపా కృష్ణమూర్తి

వేపా కృష్ణమూర్తి (సెప్టెంబర్ 13, 1910 %–% సెప్టెంబర్ 9, 1952) ఆధునిక భారతదేశ నిర్మాణంలో విశిష్టమైన స్థానం సంపాదించిన గొప్ప తెలుగు ఇంజనీరు. తక్కువకాల జీవితం గడిపినా, తన మేధస్సు, కృషి, దూరదృష్టి వల్ల దేశ అభివృద్ధికి అంకితమైన మహెూన్నత సేవలను అందించారు. ముఖ్యంగా నదుల అనుసంధానం, ఆనకట్టల నిర్మాణం, జలవనరుల వినియోగంలో ఆయన చూపిన ప్రతిభ అపూర్వం. 1910లో శ్రీకాకుళం జిల్లా పార్వతీ పురంలో వేపా అచ్యుతం వెలనాటి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన కృష్ణమూర్తి, బాల్యం నుంచే గణితం, శాస్త్ర విజ్ఞానాలపై ఆసక్తి చూపించారు. ప్రాథమిక విద్యను మచిలీపట్నంలో పూర్తిచేసి, మద్రాస్ విశ్వ విద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్ చదివారు. చదువులో ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ బంగారు పతకాన్ని సాధించారు. ఆ కాలంలో అరుదైన ఇండియన్ స్టేట్ సర్వీసెస్ పరీక్షలో దేశవ్యాప్తంగా రెండవ ర్యాంక్ సాధించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. తరువాత ఇంగ్లాండ్‌లో శిక్షణ పొంది ఆధునిక ఇంజనీరింగ్ పద్ధతులు, నీటిపారుదల, నదుల నిర్వహణ విధానాల్లో లోతైన పరిజ్ఞానం సంపాదించారు. 1932లో రైల్వే శాఖలో ఉద్యోగం ప్రారంభించి విద్యుత్ సరఫరా విభాగంలో వినూత్న ఆలోచనలు ప్రతిపాదించారు. ఆయన రూపకల్పన చేసిన పథకాలు విశేషంగా ప్రశంసించ బడ్డాయి. తరువాత ప్రజా నిర్మాణాల శాఖలో చేరి తన కృషితో అతి తక్కువ కాలంలోనే ఉన్నత స్థానాలను అధిరోహించారు. 1946లో కేవలం 38 ఏళ్ల వయసులోనే హైదరాబాద్ రాష్ట్రానికి ముఖ్య ఇంజనీరుగా నియమితులయ్యారు. అప్పటి నుంచి ఆయన సాంకేతిక పటిమ, పరిపాలనా నైపుణ్యం మరింతగా వెలుగులోకి వచ్చాయి. ఆయన ప్రధాన కృషిలో కృష్ణా నది ప్రాజెక్ట్‌కి సంబంధించిన ప్రణాళికలు విశిష్టమైనవి. పాత అనికట్ వరదలతో దెబ్బతిని విచ్ఛిన్నమవుతున్న సమయంలో ప్రాజెక్టు పునర్నిర్మాణ అవసరాన్ని స్పష్టంగా ప్రతిపాదించారు. ఆధునిక పద్ధతులతో కొత్తగా ఆనకట్ట నిర్మించాలని సూచించారు. ఈ ఆలోచన ఆధారంగానే తరువాత ప్రసిద్ధి చెందిన ప్రకాశం బ్యారేజ్ నిర్మాణం జరిగింది. 1954%–%1957 మధ్యకాలంలో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్ట్ లక్షల ఎకరాలకు సాగునీరు అందించి, డెల్టా ప్రాంత వ్యవసాయాభివృద్ధికి పునాది వేసింది. ఆయన చూపిన దూరదృష్టి లేకపోతే ఇంత విస్తృత స్థాయిలో నీటి పారుదల సౌకర్యాలు సాధ్యమయ్యేవి కావు. దురదృష్టవశాత్తు, 1952 సెప్టెంబర్ 9న ఆయన తన విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోయారు. వరదలతో ప్రమాదకరంగా మారిన కృష్ణానదిలో పరిస్థితిని పరిశీలించేందుకు లాంచీ ద్వారా వెళ్లిన సమయంలో గండిలో చిక్కుకుని మరణించారు. ఆ క్షణం ఆయన వ్యక్తిగతంగా విషాదకరమైనా, దేశ నిర్మాణానికి త్యాగబాధక ఘట్టంగా నిలిచింది. వేపా కృష్ణమూర్తి కేవలం ఇంజనీరు మాత్రమే కాకుండా, సమాజ ప్రయోజనాలకోసం సాంకేతికతను వినియోగించాలన్న సంకల్పంతో కృషి చేసిన దూరదృష్టి గల మేధావి. నదుల అనుసంధానం ఆలోచనను ముందుగానే ప్రతిపాదించి, నీటి కొరతను అధిగమించడానికి శాశ్వత పరిష్కార మార్గాలను సూచించారు. గ్రామీణాభివృద్ధి, సాగునీరు, తాగునీటి వనరుల అందుబాటు కోసం చేసిన ఆయన ప్రయత్నాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. కేవలం 42 ఏళ్ల వయసులోనే ఆయన జీవితం ముగిసి పోయినా, తెలుగు ఇంజనీరింగ్ ప్రతిభకు ఆయన చిరస్థాయి స్ఫూర్తిగా నిలిచారు. ఆయన జీవితం ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది – జ్ఞానం, విజ్ఞానం వ్యక్తిగత ప్రగతి కోసం మాత్రమే కాకుండా, సమాజ హితానికి వినియోగించ బడాలి. వేపా కృష్ణమూర్తి త్యాగం, సేవ, దూరదృష్టి నేటికీ ఇంజనీర్లకు ఆదర్శం, తెలుగు గర్వకారణం.

# అసలు సిసలైన ప్రజాస్వామిక వాది రావి

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక జరిగిన మొట్టమొదటి లోక్‌సభ (1951–52) ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్ అగ్రనేత జవహర్‌లాల్ నెహ్రూను మించిన మెజార్టీతో గెలుపొందిన వ్యక్తి ఒక తెలుగు వారు అనే విషయం చాలా మందికి తెలియదు. అంతేకాదు, దేశంలోనే ఆ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు పొందిన లోక్‌సభ అభ్యర్థిగా కూడా రికార్డు సృష్టించింది ఆ తెలుగు వ్యక్తే. ఆయనే తెలంగాణ సాయుధ పోరాట యోధుడుగా ప్రసిద్ధులైన రావినారాయణ రెడ్డి. హైదరాబాద్ రాష్ట్రంలోని నల్గొండ నియోజకవర్గం నుంచి పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) పార్టీ తరఫున నారాయణ రెడ్డి పోటీ చేసి ఆ ఘనతను సాధించారు. నాడు హైదరాబాద్ రాష్ట్రంలో 17 ఏకసభ్య నియోజక వర్గాలు, నాలుగు ద్విసభ్య నియోజక వర్గాలు ఉండేవి. ద్విసభ్య నియోజక వర్గాలకు ఇద్దరు చొప్పున సభ్యులు ప్రాతినిధ్యం వహించే పద్ధతి ఉండేది. నల్గొండ కూడా అప్పుడు ద్విసభ్య నియోజవర్గం గానే ఉండేది. అక్కడ రావినారాయణ రెడ్డితో పాటు పోటీ చేసిన, సుకం అచ్చాలు విజయం సాధించగా, ఇద్దరూ పీడీఎఫ్ అభ్యర్థులే కావడం విశేషం. 1952 మార్చి 27 పోలింగ్ జరగగా... రావి నారాయణ రెడ్డికి 3,09,162 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి పీ.భాస్కర్ రావు పై 2,22,280 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అలాగే ఉత్తర ప్రదేశ్ లోని అలహాబాద్ కమ్‌జౌన్‌పూర్ (పశ్చిమ) ద్విసభ్య నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జవహర్ లాల్ నెహ్రూకు 2,33,571 ఓట్లు రావడం జరిగింది. తొలి లోక్‌సభ ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక ఓట్లు పొందిన ఎంపీతో పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించాలని ఆ సందర్భంలో నిర్ణయించారు. నెహ్రూజీ కన్నా అధిక ఓట్లు సాధించిన రావి నారాయణరెడ్డి చేతులమీదుగా ఢిల్లీలోని పార్లమెంట్ భవనం ప్రారంభమైంది. ఇది తెలుగు వారికి గర్వకారణమై మరచి పోలేని సంఘటనగా మిగిలి పోయింది. ఆ ఎన్నికలలో భువన గిరి శాసనసభ స్థానం నుంచి కూడా నారాయణ రెడ్డి పోటీ చేసి విజయం సాధించడం మరో విశేషం. అయితే రావి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎంపీగా కొనసాగారు. రావి నారాయణరెడ్డి, (జూన్ 5, 1908 – సెప్టెంబర్ 7, 1991) కమ్యూనిస్టు నాయకులు, తెలంగాణ పోరాటంలో ముఖ్యులు. ఆయన సంఘ సంస్కర్త. ఆంధ్ర మహాసభ ప్రారంభించిన సాంస్కృతి కోద్యమాన్ని క్రమంగా వామపక్ష సాయుధ పోరాటంగా పరివర్తన చేసిన గొప్ప నాయకులు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఆద్యునిగా కూడా ఆయనను పేర్కొంటారు. రావి... యాదాద్రి – భువనగిరి జిల్లా భువనగిరి మండలం బొల్లేపల్లిలో 1908, జూన్ 5న భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. రెడ్డి హాస్టల్ విద్యార్థిగా ఉండగానే అప్పటి నిజాం కళాశాల విద్యార్థి అయిన బద్దం ఎల్లారెడ్డితో కలసి 1930 సంవత్సరంలో దేశవ్యాప్తంగా జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో కాకినాడ వెళ్లి పాల్గొన్నారు. 1931లో హరిజన సేవాసంఘాన్ని నెలకొల్పి దాని ప్రధాన కార్యదర్శి హెూదాలో హైదరాబాద్ రాష్ట్ర వ్యాప్తంగా 100 పాఠశాలలు ప్రారంభించారు రెండు వసతి గృహాలను నిర్వహించారు. 1930లో బ్రిటిష్ మహాత్మా గాంధీ అరెస్టుకు నిరసనగా హైదరాబాద్ లోని హస్మద్ గంజ్‌లో బహిరంగ సభలో బ్రిటిష్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యల్ని తీవ్రంగా ఖండిస్తూ మాట్లాడారు. 1931లో దేవర కొండలో జరిగిన రెండవ ఆంధ్ర మహాసభలకు తన తోటి విద్యార్థులను పోగుచేసి హైదరాబాద్ నుంచి పాదయాత్రగా వెళ్ళారు. నిజామాంధ్ర మహాసభ లోని భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆర్యసమాజ్, హిందూ మహాసభలతో కలిసి పనిచేసిన కమ్యూనిస్టుగా ఆయన ఆచరణ విశిష్టమైనది. సిద్ధాంత పరంగా విభేదించే శక్తులతో ఐక్య సంఘటన ఏర్పరచి ఏకతాటిపై ఉద్యమాన్ని ఎలా నిర్మించవచ్చో తన ఆచరణ ద్వారా నిరూపించిన ప్రజాస్వామిక వాది రావి. 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌ను స్థాపించిన వారిలో రావి ముఖ్యులు. నిజాం ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీపై విధించిన నిషేధం ఎత్తేయాలని అక్టోబరు 24న తొలిబ్యాచ్ సభ్యులుగా సత్యాగ్రహం చేశారు. ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా తలెత్తిన ప్రజా పోరాటానికి మార్గ నిర్దేశం చేసిన జననేత ఆయన.

# పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్,ను కలిసిన పరమేశ్వర్ రెడ్డి




**ఉప్పల్,సెప్టెంబర్ 08 (సూర్యరేఖ)**తెలంగాణ పీసీసీ చీఫ్‌గా మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టి ఏడాది అయింది. ఈ సందర్భంగా ఉప్పల్, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు మందుముల పరమేశ్వర్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్,మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్స రెడ్డి బూపతి రెడ్డి,లు మర్యాదపూర్వంగా మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్‌కు పరమేశ్వర్‌రెడ్డి,వజ్రేష్‌యాదవ్,బూపతిరెడ్డి,లు పుష్పగుజ్జాలను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... మహేష్ కుమార్ గౌడ్ సమర్ధవంతంగా సంవత్సరం పాటు తన బాధ్యతను నిర్వర్తిస్తూ అన్ని వర్గాల నాయకులకు సరియైన న్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. అధిష్టానం అగ్రనేతల మన్ననలు పొంది రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్ని ప్రజలకు చేరువైన నాయకుల్ని కూడగడుతున్న మహేష్ కుమార్ గౌడ్ అభినందనీయుడన్నారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని పరమేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ఎస్సీ,ఎస్టీ,కోయ రైతులకు ఉచిత కోళ్ల పంపిణీ చేసిన ఉద్యాన విశ్వవిద్యాలయం





**రాజేంద్రనగర్,సెప్టెంబర్ 08 (సూర్యరేఖ)** ఎస్సీ ఎస్టీ రైతులకు కోళ్ల పెంపకం ద్వారా అదనపు ఆదాయం కల్పించడమే ధ్యేయంగా ప్రారంభించిన ఉచిత కోళ్ల పంపిణీ రెండో విడత కార్యక్రమాన్ని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం ములుగు జిల్లాలో చేపట్టింది. ఈ మేరకు ఉచితంగా సోనాలి జాతి కోడి పిల్లల పంపిణీని చేసింది. వర్సిటీకి ఎస్సీ,ఎస్టీ ఉప ప్రణాళికల కింద కేటాయించిన నిధులను ఈ పథకానికి వెచ్చించినట్లు వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి తెలిపారు. తొలివిడతగా మహబూబాబాద్ జిల్లాలో పంపిణీ చేపట్టగా రెండో విడతలో ములుగు జిల్లాలోని రాష్ట్ర గవర్నర్ దత్తత గ్రామమైన కొండపర్తి ( తాడ్వాయి మండలం) లో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ములుగు మండలంలోని జోగన్నపేటలో ఎస్సీ,ఎస్టీ రైతులకు సైతం ఈ సోనాలి రకం కోడి పిల్లలను పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు పంపి ణీచేసే కోడి పిల్లల్లో. రెండు పుంజులు,8 పెట్ట లు ఉంటాయని వర్సిటీ హార్టికల్చర్ డీన్ డాక్టర్ జే.చీనా తెలిపారు "60 రోజుల్లో 2-3 కిలోల మేరకు పెరుగుతాయి. పెట్టలు రెండో నెల నుంచి గుడ్లు పెడతాయి. గుడ్లు,మాంసం అమ్మకాల ద్వారా రైతులకు లాభం చేకూరుతుంది. రైతుల జీవన ప్రమాణాల పెరుగుదలకు దోహద పడేలా ఈ పథకాన్ని చేపట్టినట్లు"ఆయన అన్నారు.150 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు,60 కోయ కుటుంబా లకు చెందిన రైతులకు 6 వారాల వయసున్న10 కోడి పిల్లలు చొప్పున అందజేశారు.మరిన్ని జిల్లాలకు సైతం ఈ పథకాన్ని వర్తింపచేస్తామని తెలిపారు. ఈ పథకంలో పంపిణీ చేసిన కోడి పిల్లలకు కోడి పిల్లలు తూకం వచ్చేందుకు,అవి ఆరోగ్యంగా పెరిగేందుకు కావలసిన సలహాలు,జాగ్రత్తలను స్థానిక వెటర్నరీ అధికారులు, శాస్త్రవేత్తలు అందచేస్తారు.

# దివంగత మహానటుడు అల్లు రామలింగయ్య సతీమణి అల్లు కనకత్తమ్మ దశదినకర్మలో పాల్గొని అల్లు అర్జున్,ను పరామర్శించిన గడ్డం రవికుమార్




**హైదరాబాద్,సెప్టెంబర్ 08(సూర్యరేఖ)** జూబ్లీహిల్స్ జెఆర్ సిలో జరిగిన ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ మాతృమూర్తి,దివంగత మహానటుడు పద్మశ్రీ అల్లు రామలింగయ్య సతీమణి అల్లు కనకరత్నమ్మ దశదినకర్మలో పాల్గొని, వారి చిత్రపటానికి నివాళులు అర్పించి,అల్లు అరవింద్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్,ను తెలంగాణ రాష్ట్ర యువ కాపునాడు అధ్యక్షుడు,ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గడ్డం రవికుమార్ పాల్గొని ఐకాన్ స్టార్ అల్లు అర్జున్,ను పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం రవికుమార్ మాట్లాడుతూ... అల్లు కనకరత్నమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆమె కుటుంబానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అమ్మడాపురం రాజుగౌడ్,అల్లు అర్జున్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అల్లు కనక రత్నమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం...



**నిజాంపేట,సెప్టెంబర్08(సూర్యరేఖ)**గురువు పూజోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320 డి వారి ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో నిజాంపేటకు చెందిన గుడ్ల శ్రీకాంత్,కు ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డును అందించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయుడు శ్రీకాంత్,ను ఆరోగ్యమే మహాభాగ్యం టీం సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ...చల్మెడ స్కూల్లో 13 సంవత్సరాలు ఉపాధ్యాయుని సేవలను అందించి నందగోకుల్ పాఠశాలలో విద్యార్థులకు తన సొంత డబ్బులతో టై,బెల్ట్ అందించి విద్యార్థులకు మంచి విద్యాబోధన అందిస్తూ నిరంతరం శ్రమించడంతో ఆయన సేవను గుర్తించి రామయంపేట లయన్స్ క్లబ్ గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేస్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు శ్రీకాంత్ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయునిగా గుర్తించి సన్మానించిన రామాయంపేట లైన్స్ క్లబ్ అలాగే ఆరోగ్యమే మహాభాగ్యం టీం సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతూ ఈ సత్కారాన్ని బాధ్యతగా స్వీకరిస్తూ విద్యార్థులకు మంచి విద్యతోపాటు వారికి సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామయంపేట లైన్స్ క్లబ్ సభ్యులు జీడి తిరుపతిగౌడ్,జిపి స్వామి,అస్గర్,నాయిని వెంకటేశం,శ్రీనివాస్ గౌడ్,వినయ్ గౌడ్,రంజిత్ గౌడ్,శనగపల్లి తిరుపతి రవీందర్,జగన్,నాగరాజు,పంజా శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.

## తాత్కాలిక రోడ్డు పనులు ప్రారంభం..



**నిజాంపేట,సెప్టెంబర్08(సూర్యరేఖ)** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిజాంపేట మల్కా చెరువు మత్తడి వద్ద రోడ్డు కొట్టుకుపోవడంతో గత 15 రోజుల నుండి నస్కల్ నిజాంపేట గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని పలుమార్లు దినపత్రికలో ప్రచురితం కావడంతో స్థానిక ఎంపీడీవో రాజిరెడ్డి,మండల అధికారులు స్పందించి తాత్కాలిక రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకపోవడంతో ట్రాక్టర్,లతో మట్టిని పోయిస్తున్నామని ఇరు గ్రామాల ప్రజలకు రోడ్డున అందుబాటులో తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రీతి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు,జిట్టి మారుతి,దేశెట్టి లింగం,లింగంగౌడ్,మెట్టు వెంకట్,తదితరులు ఉన్నారు.

## యూరియా కోసం క్యూలైన్ లో తిప్పలు పడుతున్న రైతన్నలు..




**నిజాంపేట,సెప్టెంబర్8(సూర్యరేఖ)** మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో సోమవారం యూరియా లోడ్ లారీ రావడంతో సొసైటీ వద్ద రైతులు కిక్కిరిసి పోయారు. 700 యూరియా బస్తాలను పోలీసుల ఆధ్వర్యంలో రైతుల నుండి పట్టా పాసు బుక్,ఆధార్ కార్డు జిరాక్స్,తీసుకొని రైతుకు ఒక్కో యూరియా సంచులను అందించారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ...వరి నాట్లు వేసి నెల రోజులు అవుతున్న యూరియా సంచులు కొరతపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. రైతులు యూరియా కోసం తిప్పలు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వానికి కండ్లు కనబడడం లేదా అని రైతులు ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వం మేల్కొని రైతులకు సరిపడే యూరియాను అందించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

**రైతులకు యూరియా పంపిణీ విషయంలో ప్రభుత్వం విఫలం..**

**బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రైతు జిట్టి రమేష్..**

రైతులకు యూరియా అందించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. 15 ఎకరాలలో వరి పంట వేస్తే ఇప్పటి వరకు యూరియా బస్తాలు దొరకకపోవడంతో పంటను నాశనం చేసుకునే పరిస్థితి నెలకొంది. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు కష్టం రాకుండా సకాలంలో యూరియాను అందించి రైతుల సంక్షేమం కోసం పాటుపడితే ఇప్పుడున్న ప్రభుత్వం మాది రైతుల ప్రభుత్వం అని చెప్పుకుంటున్నారే కానీ రైతుల గోస కనబడత లేదా అని ప్రశ్నించారు. రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడు బాగుపడలేదన్నారు.

# పల్లెల ప్రగతికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యతనిస్తూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు..

సకల సౌకర్యాలతో మోడల్ స్కూల్ ను తీర్చిదిద్ది విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించే దిశగా అడుగులు..

మోడల్ స్కూల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి..

రూ.28.45 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..

టేక్మాల్ మండలంలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.20 కోట్లతో బీటీ రోడ్లకు శంకుస్థాపనలు..

గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూ.8.45 కోట్లలతో బి.టి రహదారులకు శంకుస్థాపనలు..

రాష్ట్ర వైద్య ఆరోగ్య సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖామాత్యులు దామోదర్ రాజనర్సింహ





**రామాయంపేట,సెప్టెంబర్ 08(సూర్యరేఖ)**పల్లెల ప్రగతికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యతనిస్తూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగిస్తుందని మోడల్ పాఠశాల,కళాశాలకు మౌలిక వసతులు కల్పిస్తూ నాణ్యమైన గుణాత్మక విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.సోమవారం టేక్మాల్ మండలంలో రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ టేక్మాల్ మండలంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.ముందుగా దానోర గ్రామంలో రూ.400 లక్షలు అంచనా వ్యయంతో మెదక్ జిల్లాలో కొత్తపల్లి నుండి చింతకుంట వరకు రోడ్డును,టేక్మాల్ ధనురా రోడ్డు 300 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు పటిష్టపరుచుటకు శంఖుస్థాపన చేయడం జరిగింది.అనంతరం గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ ఎన్ టిఎఫ్ డిఎఫ్ నిధులతో రూ.5.19 కోట్ల వ్యయంతో ఎల్లుపల్లి తాండ మొరవని కుంట తండా యోగ్యతాండమీదుగా ఆర్ అండ్ బి రోడ్డు





ఎల్లుపేట ఎక్రోస్డ్ వరకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మోడల్ స్కూల్ ను పరిశీలించారు. మోడల్ స్కూల్ మౌలిక వసతులపై సంబంధిత జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఉపాధ్యాయులతో సంప్రదింపులు జరిపి కంప్యూటర్ ల్యాబ్ వెంటనే ప్రారంభించాలని మీకు కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.తదుపరి గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూ.326 లక్షల వ్యయంతో ఆర్ అండ్ బిరోడ్డు నుండి వెంకటాపూర్ తండా వరకు బిటి రోడ్డు,భవనాల శాఖ ఆధ్వర్యంలో నార్సింగి నుండి శంకరంపేట వరకు రూ.1300 లక్షలతోబీటీ రోడ్డు. శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మెదక్ ఆర్ డిఓ రమాదేవి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ డీఎస్పీ ప్రసన్నకుమార్,ఆర్ అండ్ బి ఈ.ఈ సర్దార్ సింగ్,పంచాయతీరాజ్ ఈ.ఈ నరసింహులు గిరిజన సంక్షేమ శాఖ అధికారి నీలిమ,ట్రైబల్ వెల్ఫేర్ డిఈ భాషా వివిధ ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం...



**నిజాంపేట,సెప్టెంబర్08(సూర్యరేఖ)** మండల కేంద్రానికి చెందిన జాల భూమయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది.ఇట్టి విషయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు,బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మృతుని కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు మావురం రాజు,చల్మేటి నాగరాజు,తాడెం మల్లేశం రాములుగౌడ్ పంపరి నగేష్,గొల్ల శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం..




**నిజాంపేట,సెప్టెంబర్08(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించుకోవడం జరిగిందని మండల విద్యాధికారి యాదగిరి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలోని15 మంది ఉత్తమ ఉపాధ్యాయులు ఉమ్లా నాయక్,రాజయ్య, నరసింహారెడ్డి మన్మధ,దివ్య కల్పన పరమేశ్వర్, మహేష్ మహేశ్వర్ నర్సింలు మమత భాగ్యలత,లింగం,లను ఎంపిక చేసి వారిని సన్మానించామన్నారు. ఉపాధ్యాయుల దేశ నిర్మాతలే కనుక వారిని ప్రోత్సహించినట్లయితే విద్యార్థులకు మంచి విద్యనందిస్తారని భవిష్యత్ తరాలకు ఉపాధ్యాయులు ఎంతో అవసరమని ప్రతి సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని సన్మానించుకోవడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల ఆందోళన..



**రామాయంపేట,సెప్టెంబర్ 08(సూర్యరేఖ)** రామాయంపేటలో యూరియా కొరత రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద ఉదయం నుంచే పెద్ద ఎత్తున క్యూలైన్లు కనిపించాయి.గంటల తరబడి నిలబడి ఒక్కో బస్తా యూరియా కోసం రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

**రైతుల ఆవేదన..**

విత్తనాలు వేసి వారం దాటింది,కానీ యూరియా దొరకక పంటలు ఎండిపోతున్నాయి.ఒక్కో రైతుకి 2-3 బస్తాలు అవసరం,కానీ ఒక్క బస్తా కూడా సరిగ్గా అందడం లేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.సహకార సంఘం దగ్గర గంటల తరబడి క్యూలో నిలబడి చివరికి ఖాళీ చేతులతో వెళ్లాల్సి వస్తోంది.ఇలా కొనసాగితే పంటలు నష్టపోతాయని మరో రైతు వాపోయారు.

**అధికారుల స్పందన..**

ఈ సమస్యపై రామాయంపేట వ్యవసాయ అధికారి రాజునారాయణ,ను సంప్రదించగా జిల్లాకు అవసరమైనంత యూరియా సరఫరా ఆలస్యమవుతోంది.సోమవారం రామాయంపేట కు 490 బస్తాలు,రాయలపూర్ గ్రామానికి 445 బస్తాలు రావడం జరిగిందన్నారు.రాబోయే మూడు రోజుల్లో అదనపు రవాణా వస్తుంది.రైతులందరికీ సమానంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జీఎస్టీపై మోడీ ప్రభుత్వం నిర్ణయం వల్ల భారతీయులందరికీ లబ్ధి

వెంకటేష్ యాదవ్



**నాంపల్లి,హైద్రాబాద్,సెప్టెంబర్08(సూర్యరేఖ)** భారత ప్రభుత్వం ప్రకటించిన గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ (జిఎస్టి)రేట్ల తగ్గింపులు దేశ ఆర్థిక విధానానికి వినియోగదారుల ఖర్చులలో ఒక కొత్త అధ్యాయానికి నాందియని భారతీయ జనతా పార్టీ జియాగూడ డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్ తెలిపారు.ఈ సందర్భంగా జియాగూడ డివిజన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్రం వచ్చాక ప్రజలందరూ ఉపయోగించుకునే 80శాతం వస్తువులపై టాక్స్ తగ్గింపు ఇదే మొదటిసారి అన్నారు.ముఖ్యంగా గతంలో ఉన్న నాలుగు పన్ను శ్లాబులను రద్దు చేసి,ఒక సరళమైన మూడు అంచెల విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని,నిత్యావసర వస్తువులకు 5శాతం,సాధారణ వస్తువులకు 18శాతం, విలాసవంతమైన హానికరమైన వస్తువులకు 40శాతంతో జిఎస్టి వర్తించేలా మార్పులు చేపట్టి,ప్రజలకు వినియోగదారులకు మేలు జరిగేలా మోడీ ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందన్నారు.ఈ నిర్ణయం వల్ల భారతీయ జలందరికీ, వినియోగదారులకు వ్యాపారాలకు నేరుగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. గతంలో అత్యధికంగా ఉన్న 28శాతం శ్లాబును పూర్తిగా తొలగించి,పాన్ మసాలా,గుట్కా,సిగరెట్లు, బీడీలు,లగ్జరీ వస్తువులు. జూదం వంటి కొన్ని వస్తువులకు మాత్రమే 40శాతం జిఎస్టి వర్తించనుందని తెలిపారు. గృహోపకరణాలు వంటి వాటిపై జీఎస్టీ12,18 శాతం నుండి కేవలం 5శాతంకి తగ్గిందన్నారు. టీవీలు ఏసీలు రిఫ్రిజిరేటర్లు వాషింగ్ మెషిన్ల వంటి ఉపకరణాలపై గతంలో ఉన్న 28శాతం జీఎస్టీ ఇప్పుడు 18శాతం కి తగ్గి ఈ వస్తువులు చౌకగా లభించనున్నాయన్నారు. హెల్త్ సెక్టార్ లో ప్రజలకు ఊరట నిచ్చే విధంగా మార్పులు జరిగాయని, మెడిసిన్స్ చౌకగా ఇకపై లభించనున్నాయన్నారు. జీవిత,ఆరోగ్య బీమా పాలసీలకు జీఎస్టీ నుంచి మినహాయింపు వల్ల కేంద్ర ప్రభుత్వం ఏటా వేల కోట్ల ఆదాయం కోల్పోతున్న ప్రజల మేలు సంక్షేమం కోసం మాత్రమే మోడీ ప్రభుత్వం ఆలోచన చేసి జిఎస్టిలో పెనుమార్పులు చేపట్టిందన్నారు.జీఎస్టీ పై సంచలన నిర్ణయం తీసుకొని ప్రజలకు వినియోదారులకు పన్ను భారాన్ని తగ్గించిన ప్రధాని మోదీ,కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్,కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు వెంకటేష్ యాదవ్ చెప్పారు.

## యూరియా కొరత..రైతుల రోషం రోడ్డుపై





**రామాయంపేట,సెప్టెంబర్ 08(సూర్యరేఖ)** చేగుంట మండలంలో యూరియా కొరత రైతుల ఆవేదనను రోడ్డుపైకి తెచ్చింది.మూడు రోజులుగా ఎరువులు అందకపోవడంతో సోమవారం ఉదయం చేగుంట గాంధీ చౌరస్తా వద్ద రైతులు రాస్తారోకో చేపట్టారు.ఇటీవల 440 బస్తాల యూరియా మాత్రమే చేరుకోవడంతో కొంతమంది రైతులకు పంపిణీ జరిగినా,మిగతావారికి అందలేదు.సోమవారం కొత్త సరఫరా వస్తుందని తెలిసి తెల్లవారుజామున మూడు గంటలకే రైతులు రైతు వేదిక వద్దకు తరలివచ్చారు.అయితే యూరియా రాకపోవడంతో ఆగ్రహించిన వారు ప్రధాన కూడలిలో బైఠాయించి ప్రభుత్వంపై నినాదాలు చేశారు.అరగంట పాటు కొనసాగిన రాస్తారోకోతో మెదక్,హైదరాబాద్, నిజామాబాద్ రహదారులపై ట్రాఫిక్ నిలిచిపోయింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి అక్కడకు చేరుకుని రైతులతో చర్చించారు.అనంతరం వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి మంగళవారం యూరియా సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు.రైతులు మాట్లాడుతూ... మాకు సమయానికి ఎరువు రాకపోతే పంటలు దెబ్బతింటాయి.వాగ్దానాలు కాకుండా వెంటనే యూరియా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## తాత్కాలిక రోడ్డు పనులు ప్రారంభం..




**నిజాంపేట,సెప్టెంబర్08 (సూర్యరేఖ)** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిజాంపేట మల్కా చెరువు మత్తడి వద్ద రోడ్డు కొట్టుకుపోవడంతో గత 15 రోజుల నుండి నస్కల్ నిజాంపేట గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని పలుమార్లు "సూర్యరేఖ" దినపత్రికలో ప్రచురితం కావడంతో స్థానిక ఎంపీడీవో రాజిరెడ్డి,మండల అధికారులు స్పందించి తాత్కాలిక రోడ్డు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకపోవడంతో ట్రాక్టర్,లతో మట్టిని పోయిస్తున్నామని ఇరు గ్రామాల ప్రజలకు రోడ్డున అందుబాటులో తీసుకొస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రీతి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు,జిట్టి మారుతి,దేశెట్టి లింగం,లింగంగౌడ్,మెట్టు వెంకట్, తదితరులు ఉన్నారు.

## బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్,కు వినతి పత్రం అందించిన వ్యవసాయ కార్మికులు




**బెల్లంపల్లి,సెప్టెంబర్08(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సమితి ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు,సబ్ కలెక్టర్ మనోజ్,కి వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రంలో ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరించాలి,రోజుకు కనీసం రూ.700 కూలి ఇవ్వాలి,సామాజిక పెన్షన్లు పెంచాలి,భూమి పట్టాలు,ఇంద్రమ్మ మంజూరు ఇళ్ళను వెంటనే అందజేయాలని పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని సమస్యలకు తక్షణ పరిష్కారం కోరారు.ఈ కార్యక్రమంలో అక్క పెల్లి బాపు,గుండా చంద్ర మాణిక్యం,కొండు బానేష్, ఆడెపు రాజమౌళి,బొంతల లక్ష్మీనారాయణ చిప్ప నరసయ్య,కొంకుల రాజేష్,బొల్లం తిలక్ అంబేద్కర్, రత్నం రాజం,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద భీమా..




**నిజాంపేట,సెప్టెంబర్08(సూర్యరేఖ)** మండల పరిధిలో నగరం గ్రామంలో సోమవారం ఎస్బిఐ విడ్స్ సిఎఫ్ఎల్ హవేలీఘనపూర్ శాఖ ద్వారా గ్రామ పంచాయతీ సిబ్బందికి జీ -పాయ్ రూ.10 లక్షల ప్రమాద భీమా పీఎంజెజెవై ద్వారా రూ.2 లక్షల ప్రమాద భీమా చేయించారు. అలాగే గ్రామస్థులు స్వంతంగా ప్రధాన మంత్రి జన సురక్ష భీమా యోజన సంవత్సరానికి రూ.20తో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన సంవత్సరానికి రూ.436తో రూ.2 లక్షల ప్రమాద భీమాను చేయించుకోవడంజరిగింది.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్స్ నరేష్ కుమార్,వంశీ, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## జీఎస్టీ స్లాబు తగ్గింపు పేద ప్రజలకు వరం..



**కామారెడ్డి,సెప్టెంబర్08(సూర్యరేఖ)** భారతదేశంలోని పేద మధ్యతరగతి ప్రజలందరికీ కోసం జీఎస్టీ స్లాబ్,లను ప్రధాని నరేంద్రమోడీ తగ్గించారని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ గుప్తా అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో భారత ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ...నిరుపేద ప్రజల కోసం జీఎస్టీ స్లాబు తగ్గింపు చేశారని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు మాజీ కౌన్సిలర్లు భారతీయ జనతా పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్-44, సదాశివనగర్ లిమిట్స్ లో స్పీడ్ లేజర్ గన్స్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ

**కామారెడ్డి,సెప్టెంబర్08(సూర్యరేఖ)** ప్రజల ప్రాణాలను కాపాడేందుకే వేగ నియంత్రణ ఏర్పాట్లు నిబంధనలు ఉల్లంఘించిన వారికి స్పీడ్ లేజర్ గన్స్ ద్వారా చాలనాలు జారీ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న భద్రతా చర్యలు, కట్టుదిట్టమైన నిబంధనల అమలు ఫలితంగా ఈ సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గింది.2024 ఆగస్టు వరకు జిల్లాలో మొత్తం188 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా,2025 ఆగస్టు వరకు వాటిని 145కి తగ్గించగలిగాం.దీని ద్వారా మొత్తం 22.9% తగ్గుదల నమోదైంది.అదేవిధంగా మరణాలు 197 నుండి 153కి తగ్గి 22.3 శాతం తగ్గుదల ఉన్నది.అలాగే గాయపడ్డ కేసులు కూడా 181 నుండి 173కి తగ్గగా,గాయపడిన వ్యక్తులు 355 నుండి 298కి తగ్గడం ద్వారా రోడ్డు ప్రమాదాల నియంత్రణలో గణనీయమైన తగ్గుదల నమోదైంది. ఇది జిల్లా స్థాయిలో రోడ్డు భద్రతా చర్యల విజయాన్ని సూచిస్తూ,ప్రజల ప్రాణ రక్షణలో ఒక గొప్ప ముందడుగుగా నిలిచింది. రోడ్డు ప్రమాదాల తగ్గుదలకు ప్రధాన కారణాలు ప్రతిరోజూ వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ చెకింగ్‌లు,హెల్మెట్ లైసెన్స్ లేని వాహనదారులపై కఠిన చర్యలు, అతివేగంగా ప్రయాణించే వారిపై



జరిమానాలు విధించడం అని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర ఐపీఎస్ సదాశివనగర్, ఎన్‌హెచ్-44 వద్ద అయ్యప్ప ఆలయం సమీపంలో స్పీడ్ లేజర్ గన్స్ ను ప్రారంభించారు. జిల్లాలో మొత్తం మూడు స్పీడ్ లేజర్ గన్స్ వాహనదారుల వేగాన్ని నియంత్రించడం కొరకు పనిచేస్తున్నవి,అధిక వేగంతో ప్రయాణించే వాహనాలను గుర్తించి జరిమానాలు విధించి క్రమంగా వారి వాహణముల వేగనియంత్రణ చేయడం,తద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ప్రధాన ఉద్దేశం. ఇకపై ఈ లేజర్ గన్స్ జాతీయ రహదారి,జాతీయ రహదారి,రాష్ట్ర రహదారులపై ఉండును.రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా మీ ప్రాణాన్ని,మీ కుటుంబ సభ్యుల ప్రాణాలను కాపాడుకోండి" అని జిల్లా పోలీసు శాఖ ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామని ఎస్పీ తెలిపారు.

# జడ్పిటిసి,ఎంపిటిసి ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష..

**రామాయంపేట,సెప్టెంబర్ 08 (సూర్యరేఖ)** జిల్లాలో జరగనున్న జడ్పిటిసి,ఎంపిటిసి ఎన్నికలు పారదర్శకంగా,శాంతియుతంగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు.సోమవారం ఐడిఓసి కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 21 జడ్పిటిసి, 190 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయని ఇందుకోసం 1052 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు.

**జిల్లాలోని ఓటర్ల వివరాలు..**

పురుషులు 2,51,532,మహిళలు -2,71,787, ఇతరులు 08,మొత్తం 5,23,327 మంది ఓటర్లు ఉన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు



జాబితాలో ఉండేలా చూసుకోవాలని సూచిస్తూ, ముసాయిదా ఓటరు జాబితా,పోలింగ్ కేంద్రాల వివరాలు జిల్లాలోని అన్ని ఎంపిడిఓ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత తుది జాబితాను ఈ నెల10న ప్రకటించనున్నట్లు ఆయన



స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్,జడ్పి సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలకు అప్రమత్తతే ప్రధాన ఆయుధం

జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు

**రామయంపేట,సెప్టెంబర్ 08(సూర్యరేఖ)** ప్రస్తుత కాలంలో సాంకేతికతను వినియోగిస్తూ సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్న పరిస్థితుల్లో, మెదక్ జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు ప్రజలకు అప్రమత్తతే ప్రధాన రక్షణ అని ఒక ప్రకటనలో సూచించారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ.డి.వి.శ్రీనివాస రావు మాట్లాడుతూ ఇటీవల ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు,స్టాక్ మార్కెట్ మోసాలు, యూపీఐ మోసాలు,లోన్ ఫ్రాడ్లు పేరుతో నకిలీ లాభాలను చూపించి,అమాయక ప్రజల కష్టార్జిత సొమ్మును దోచుకుంటున్నారని తెలిపారు. వాట్సాప్, టెలిగ్రామ్,సోషల్ మీడియా ద్వారా పంపే ఏపీకే ఫైళ్లు డౌన్‌లోడ్ చేసుకుంటే,వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు వినియోగిస్తున్న కొత్త పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్,యూపీఐ మోసం ,నకిలీ వెబ్‌సైట్లు,స్టాక్ మార్కెట్ మోసాలు, ఆన్‌లైన్ షాపింగ్‌లో నకిలీ ఆఫర్లు వంటి వాటిగా గుర్తించబడ్డాయి.ముఖ్యంగా యువత ఈ మోసాలకు ఎక్కువగా గురవుతున్నారని, మాయమాటలకు నమ్మి డబ్బులు కోల్పోకుండా జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లలో మొదట ఎక్కువ లాభాలు వస్తాయని చూపించి ఒకసారి డబ్బులు పెట్టాక తిరిగి తీసుకోవాలని



ప్రయత్నిస్తే ఇస్తారనే హామీ లేకుండా పోతుందని ఉదాహరణగా చెప్పారు. అలాగే సోషల్ మీడియాలో వస్తున్న పార్ట్ టైమ్ జాబ్ ఆఫర్లకు స్పందించకూడదని హెచ్చరించారు. ఒకవేళ మోసపోయినట్లయితే వెంటనే గోల్డెన్ అవర్‌లోనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయడం ప్రతి బాధితుడి మొదటి కర్తవ్యమని ఎస్పీ గారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలి





**అదనపు కలెక్టర్ నగేష్**

**రామాయంపేట,సెప్టెంబర్ 08(సూర్యరేఖ)** జిల్లా ప్రజల సమస్యలు ఆలస్యం లేకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేష్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 56 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి.ప్రజలు ఈ సందర్భంగా పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రేషన్ కార్డుల మంజూరు,పేర్ల సవరణ పింఛన్ల మంజూరు, పెండింగ్ పింఛన్ దరఖాస్తుల పరిష్కారం రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలు,పంట నష్ట పరిహారం గ్రామాల్లో తాగునీరు,విద్యుత్ సమస్యల పరిష్కారం ఇండ్ల నిర్మాణానికి భూకేటాయింపు ఇళ్లు పూర్తిచేయడానికి నిధుల విడుదల రహదారి డ్రైనేజీ,లైటింగ్ వంటి మౌలిక సదుపాయాల సమస్యలు దరఖాస్తులను స్వీకరించిన అనంతరం అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ...ప్రజావాణి అనేది ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు వేదిక.ప్రతి విభాగం అధికారి తక్షణమే దరఖాస్తులను పరిశీలించి,పరిష్కారం కోసం సమయపరిమితిని నిర్ధారించాలి వాయిదాలు లేకుండా సమస్యలను పరిష్కరించాలని సూచించారు.జడ్పీ సీఈఓ ఎల్లయ్య మాట్లాడుతూ గ్రామస్థాయి అభ్యర్థనలపై పంచాయతీ సిబ్బందిని బాధ్యత వహించేలా చేస్తామని తెలిపారు.డీఆర్‌డీఓపీడి శ్రీనివాసరావు సంక్షేమ పథకాల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ప్రజావాణి పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది.ఈ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం అధికారుల భాధ్యత,ప్రతి సమస్యను ప్రాధాన్యంతో పరిష్కరించి ప్రజలకు తక్షణ ఫలితాలు అందించాలని అదనపు కలెక్టర్ నగేష్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభ విజయవంతం చేద్దాం..

**పాక జ్ఞానేశ్వరి రవి ప్రసాద్.**



**కామారెడ్డి,సెప్టెంబర్ 08(సూర్యరేఖ)** ఈనెల 15న కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీసీడీకిలేషన్ సభ విజయవంతం చేద్దామని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు జ్ఞానేశ్వరి రవి ప్రసాద్ అన్నారు. కామారెడ్డి నియోజకవర్గం నుండి పోటీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,బిసి డిక్లరేషన్ సభ కామారెడ్డిలోని ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆమె తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో బీసీలు 56 శాతం ఉన్నారని,వారికి న్యాయం చేయాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో కామారెడ్డి నుండి పోటీ చేసి బీసీ డిక్లేషన్ సభ ఏర్పాటు చేశారని ఆమె తెలిపారు.కామారెడ్డి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రతి ఒక్కరు తరలివచ్చి బహిరంగ సభ విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## బెల్లంపల్లి అక్రమ హెూల్డింగ్‌లు తొలగించాలి..




**బెల్లంపల్లి,సెప్టెంబర్08(సూర్యరేఖ)** బెల్లంపల్లి మున్సిపాలిటీలో ప్రభుత్వం భూముల్లో అనుమతి లేకుండా అక్రమ హెూల్డింగ్‌లు పెరుగుతున్నాయి. వీటిని తక్షణమే తొలగించాల్సిన అవసరం ఉందని న్యాయవాది రాకేష్ డిమాండ్ చేశారు.గత సోమవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ సమావేశానికి ఆయన ప్రత్యేక ఫిర్యాదు చేయగా, మున్సిపల్ చట్టాలకు విరుద్ధంగా స్థలాలపై హెూల్డింగ్‌లు నిర్మించడాన్ని పూర్తిగా అరికట్టాలని సూచించారు.మున్సిపల్ అధికారులు ఇప్పటివరకూ ఈ అక్రమ హెూల్డింగ్‌లను పూర్తిగా తొలగించడంలో తలపడలేదని తెలిపారు.నగర పరిధిలో అభివృద్ధి క్రమంగా జరుగుతుండగా,అక్రమ హెూల్డింగ్‌ల నిర్మాణం వలన శ్రమించి గల ప్రజలకు భూమి విషయంలో అసౌకర్యాలు కలుగుతున్నాయి. మున్సిపల్ చట్టాలను కచ్చితంగా పాటిస్తూ,ప్రజల భద్రత,అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అక్రమ హెూల్డింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన జోరుగా తెలిపారు.ప్రజల సంక్షేమం కోసం అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఈ అంశంపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశించారు.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది..

**విద్య అన్నింటి కంటే శక్తివంతమైనది..**
**ఎంత ఎత్తుకు ఎదిగినా ఉపాధ్యాయులను మరువొద్దు..**
**శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీధర్ రెడ్డి**



**రాజేంద్రనగర్,సెప్టెంబర్08(సూర్యరేఖ)** సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది వారిని సమాజంలో ఉత్తమ పౌరులుగా తయారు చేసేది గురువులేనని శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీధర్ రెడ్డి అన్నారు.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని సోమవారం పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.అంతకుముందు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా శివరాంపల్లి ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల,వీకర్ సెక్షన్ పాఠశాలలకు సంబంధించిన వంద మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పడమటి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ... సమాజంలో అమ్మ,నాన్నల తర్వాత స్థానం గురువుకి ఇచ్చారని,గురువు గొప్పతనాన్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ దేశానికి బాగా చాటి చెప్పారని, ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. అంధకారాన్ని తొలగించి అజ్ఞానం స్థానంలో జ్ఞానాన్ని బోధించే గొప్ప వ్యక్తి గురువని అన్నారు. గురువుల సేవలను గుర్తించి గౌరవించాలనే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శివరాంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనునాయక్,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సునీత,ఉపాధ్యాయుల సుదర్శన్, జనార్ధన్ చారి వెంకటయ్య సుధాకర్ శ్రీనివాస్ రెడ్డి, రూపాదేవి కరుణాకర్ సరళమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# భాజపా టికెట్ల కోసం ఆశావాహులు ప్రయత్నాలు




**కామారెడ్డి,సెప్టెంబర్08(సూర్యరేఖ)** స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి మునిపెన్నడు లేనంతగా భారతీయ జనతా పార్టీలో పోటీ పెరిగింది. ఎవరికి వారే టికెట్లపై ఆశలు పెట్టుకొని తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న జిల్లా కమిటీ నేతలతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ స్థాయి నేతలు ఎంపీ తదితర ముఖ్య నాయకులతో సఖ్యతగా ఉంటూ వారి ఆశీర్వాదంతో టికెట్లు దక్కించుకోవాలని చూస్తున్నారు. నియోజకవర్గ స్థాయి నాయకులు పార్టీ ముఖ్య నేతలను కలిసి స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలని, తమ మనసులోని మాటను బయటపెడుతున్నట్లు తెలుస్తోంది.గ్రామస్థాయిలో తాము చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రజల్లో తమకు ఎంత ఆదరణ ఉందో వివరిస్తూ తమ అనుచర గణంతో వెళ్లి టికెట్ కోసం పైరవీలు చేస్తున్నట్లు సమాచారం.జిల్లాలో బిజెపి పార్టీకి అనుకూల వాతావరణం నెలకొంది. చాలామంది ఇతర పార్టీ నాయకులు గ్రామ పట్టణ స్థాయిలో భారతీయ జనతా పార్టీకి ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నారు.గ్రామీణ ప్రాంతాల్లోనూ బలమైన రాజకీయ పార్టీగా ఎదిగింది.దీంతో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీకి చెందిన నాయకులు దాదాపు అన్ని గ్రామాల్లోనూ భారతీయ జనతా పార్టీ నుండి టికెట్ ఆశించే వారి సంఖ్య పెరుగుతుంది.

# 40శాతం రాయితీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు..

**మండల వ్యవసాయ అధికారిని కిరణ్మయి**



**మందమర్రి,సెప్టెంబర్08(సూర్యరేఖ)** వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను ఎస్ఎంఎఎం పథకం ద్వారా రైతులకు 40 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి జి.కిరణ్మయి తెలిపారు. సోమవారం మండలంలోని సండ్రోన్ పల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఎస్ఎంఎఎం పథకం ద్వారా మందమర్రి మండాలానికి మొత్తం 135 యూనిట్లు మంజూరు అయ్యాయని దీనిలో 101 బ్యాటరీ/మ్యాన్యువల్/ ఫూట్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు,18 పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు,6 రొటోవేటర్లు,1 సీడ్ కం ఫర్టీ డ్రిల్లు,6 డిస్క్ హారో/కల్టివేటర్లు/ప్లవ్/కేజ్ వీల్స్/ రోటోపడ్లర్ 1పవర్ వీడర్,1 బ్రష్ కట్టర్,1పవర్ టిల్లర్ మంజూరు అయ్యాయని వివరించారు. ఆసక్తిగల రైతులు దరఖాస్తు ఫారం,పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ ఆధార్ జిరాక్స్,బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్, పాసుపోర్ట్ ఫోటోతో మండల వ్యవసాయ విస్తరణ అధికారికి ఈ నెల13వ తారీకు లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు.మరిన్ని వివరాల కొరకు వ్యవసాయ విస్తరణ అధికారిని కానీ మండల వ్యవసాయ అధికారిని కానీ సంప్రదించాలని కోరారు.

## డాక్టర్ మేకల శిల్పారెడ్డికి మరోసారి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా అవకాశం కల్పించిన బిజెపి పార్టీ



**ఉప్పల్,సెప్టెంబర్ 08(సూర్యరేఖ)** తెలంగాణ బీజేపీ రాష్ట్ర కమిటీని తాజాగా ప్రకటించారు.ఈ మేరకు రాష్ట్ర కమిటీని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు వెల్లడించారు.22 మందితో కూడిన రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో ఏడు మోర్చాలకు రాష్ట్ర అధ్యక్షులు ప్రకటన చేశారు.మహిళా మోర్చా అధ్యక్షురాలుగా ఉప్పల్ ప్రాంతానికి చెందిన డాక్టర్ మేకల శిల్పారెడ్డి కొనసాగిస్తున్నారు.నూతన అధ్యక్షురాలిగా మరోసారి నియమితులైన శిల్పారెడ్డి మాట్లాడుతూ...అధిష్టానం తనపై నమ్మకం ఉంచి మరోసారి అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు,తనను మరోసారి కొనసాగాలని సిఫార్సు చేసిన ఢిల్లీ అగ్ర నేతలకు ధన్యవాదాలు తెలిపారు.పార్టీ నిర్ణయించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన కార్యక్రమాలు చేపడతామని ఆమె వెల్లడించారు.అధిష్టానం వర్గం ఇంతవరకు తానకు అప్పగించిన అన్ని పనులను కార్యక్రమాలను విజయవంతం చేసినట్లు ఆమె తెలిపారు.పార్టీలో పని చేసే వారికి గుర్తింపు లభిస్తుందం దానికి తన నియమా నియామకమే ఒక ఉదాహరణని ఆమె పేర్కొన్నారు.

# ఘనంగా జిల్లా కేంద్రంలో మిలాద్-ఉన్-నబి ర్యాలీ





**నారాయణపేట,సెప్టెంబర్08(సూర్యరేఖ):** నారాయణపేట జిల్లా కేంద్రంలో ర్యాలీలో మెయిన్ చౌక్ దగ్గర జిల్లాఎస్పీ యోగేష్ గౌతమ్ పాల్గొని ముస్లిం సోదరులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...మిలాద్ ఉన్ నబి పండుగ శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీక అని, అందరూ ఐక్యత స్నేహభావంతో జీవించాలని సూచించారు. నారాయణపేట జిల్లాలో ఈ నెల 5వ తేదీన మిలాద్-ఉన్ -నబి పండుగ ఉన్నందున అదే రోజు గణేష్ నిమజ్జనం ఉన్నందున ముస్లింలు గొప్ప ఔదార్యాన్ని చాటుతూ తమ ర్యాలీని ఎనిమిదో తేదీ నాటికి వాయిదవేయడంగొప్ప విషయమని నారాయణపేట జిల్లా అంటే హిందూ ముస్లింలు భిన్నత్వంలో ఏకత్వంగా కలిసి ఉండి తమ ఐక్యత చాటాలని ఎస్పీ తెలిపారు.ఇలాంటి పండగలలో నేను పాల్పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.మిలాద్ ఉన్ నబి ర్యాలీ మార్గ మంతా పోలీసుల భద్రత ఏర్పాట్లు చేయగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతతో పర్యవేక్షణ చేపట్టారు.ర్యాలీలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హూల్ హాక్,డీఎస్పీలు నల్లపు లింగయ్య మహేష్,సీఐ శివశంకర్,ఎస్సైలు వెంకటేశ్వర్లు రాజు నరేష్ సునీత,గాయత్రి,కృష్ణ చైతన్య పోలీసులు,హిందూ ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# శిథిలావస్థకు చేరిన పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయండి

**ఆర్పిఐ(అథవాలే)జిల్లా అధ్యక్షులు రహమత్ ఖాన్**



**మందమర్రి,సెప్టెంబర్08(సూర్యరేఖ)** పట్టణంలోని 21వార్డు అంగడి బజార్ లో శిథిలావస్థకు చేరిన మండల ప్రజా పరిషత్ పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని రిపబ్లిక్ ఆన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే)జిల్లా అధ్యక్షులు ఎండి.రహమత్ ఖాన్ కోరారు.ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ సముదాయభవన్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పార్టీ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పాఠశాల భవనం నిర్మించి దాదాపు 50 సంవత్సరాలు గడిచి శిథిలావస్థకు చేరిందని, శిథిలమైన భవనంలోనే 61మంది విద్యార్థులు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని విద్యను అభ్యసిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భవనం ఎప్పుడు కూలిపోతుందోనని,విద్యార్థులు వారి తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకొని శిథిలమైన భవనాన్ని భూస్థాపితం చేసి నూతన భవనం నిర్మించాలని అప్పటి వరకు అద్దె భవనంలో పాఠశాల కొనసాగించాలని ఆయన కోరారు.శిథిలమైన పాఠశాల భవనాలను తొలగించి నూతన భవనాలు నిర్మిస్తామని సెప్టెంబర్ 5 తారీఖున నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఉపన్యాసంలో పేర్కొన్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్పీఐ జిల్లా ఇన్చార్జ్ పులిపాక శ్రీనివాస్,జిల్లా కార్యదర్శి దర్శనాల వెంకటస్వామి, జిల్లా నాయకులు గుడికందుల తిరుపతి,ధర్మపురి శ్రీనివాస్,గరిగే వెంకటేశ్వర్లు ఎండి యాకూబ్,కన్నూరి కృష్ణ,ఎండి సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా పిడిఎఫ్ రైస్ తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు..




**నిజాంపేట,సెప్టెంబర్08(సూర్యరేఖ)**మండలం నందిగామ గ్రామంలోని బుడగ జంగాల కాలనీ వద్ద అక్రమంగా పిడిఎస్ రైస్ ను తన టాటా ఏసీటి.ఎస్35 టిఏ0471 వాహనంలో 19 బస్తాలు ఆరున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్న ఇస్తారి అనే వ్యక్తి పైన కేసు నమోదు చేయడం జరిగింది.చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజేష్ పేర్కొన్నారు.

# కొల్లంపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు



**నారాయణపేట,సెప్టెంబర్08(సూర్యరేఖ)** నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి లీగల్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు సోమవారం నారాయణపేట జిల్లా కొల్లంపల్లి గ్రామంలో ధన్వాడ మండలంలో మందిపల్లి గ్రామంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ విజ్ఞాన సదస్సును అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.సురేష్,అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సిల్ ఎన్.నాగేశ్వరి నిర్వహించారు.ఈ కార్య క్రమంలో మాట్లాడుతూ...న్యాయ వ్యవస్థలో రాజ్యాంగం ప్రకారం అందరికి సమాన హక్కులు కల్పించిందని అన్నారు.ప్రజలు వాటిపై అవగాహన కలిగి ఉన్నప్పుడే తమ హక్కులను నిర్భయంగా పొందుతారని తెలిపారు. ప్రజలందరు సమానమే ఉన్నవాళ్లు,పేదవాళ్ళు అని తేడా లేదు,పేదరిక నిర్మూలనా,సంక్షేమ పథకాలు,సామాజిక భద్రతా, ప్రజలు చైతన్యంగా ఉంటేనే అన్ని హక్కులు సాధ్యమవుతయీా అవగాహన చేశారు.జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా పేదలకు ఉచిత న్యాయాన్ని ప్రజల వద్దకు పొందవచ్చు అన్నారు. చిన్న పిల్లలకు పెళ్లిళు చేస్తున్నారని అక్షరాస్యత చట్టపరమైన అవగాహన ముఖ్యంగా సమాజంలోని బలహీన వర్గాలకు హక్కులు గిరిజన హక్కులు బాల్యవివాహాలు బాలకార్మిక చట్టాలు, వయోవృద్ధుల చట్టం,తమ పిల్లలకు చిన్నవయస్సులో పెళ్లిళ్లు చేస్తే పెద్దవారిదే తప్పుగా తల్లితండ్రుల నిర్వహణ,స్త్రీ పురుష ఆధిక్యత, మహిళలకు రక్షణ చట్టం ఉన్నదని నిత్యవసర సరుకుల చట్టం ద్వారా ప్రతి ఒక్క వ్యక్తి తమ యొక్క రసీదులను జాగ్రత్తపరచుకొని నష్టం వారిని ఎదుర్కోకుండ తమను తాను కాపాడుకోవాలని తెలిపారు. హవరకట్న వేదింపులు,వరకట్న నిషేధచట్టం గవర్నమెంట్ నుంచి వచ్చే బెనిఫిట్స్ ప్రయోజనాలపై అవగాహన న్యాయపరమైన రక్షణ, చట్టపరమైన అవగాహన,ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలి,అమలు వంటివి న్యాయ సేవా సంస్థ చట్టాలపై ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలి అమలు వంటివి,న్యాయ సలహాల కోసం 15100 నెంబర్ కు ఫోన్ చేసి తమ సమస్యను చెప్తే ఈ సంస్థలో పరిష్కారం చూపడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజ్ కుమార్, పంచాయత్ సెక్రె టరీస్ అంజమ్మ జ్యోతి పారాలీగల్ వాలంటీర్స్ రూపిక,తదితరులు గ్రామా ప్రజలు పాల్గొన్నారు.

## హైదరాబాద్ కు ఆటంకం లేకుండా తాగునీళ్లు అందించాలనాదే..సీఎం రేవంత్ రెడ్డి తాపత్రయం

**కూరాకుల కృష్ణ..**



**నాంపల్లి,హైద్రాబాద్,సెప్టెంబర్ 08(సూర్యరేఖ)** అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ తో పాటు పరిసర జిల్లాల ప్రజల దాహం తీర్చేందుకు తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తాపత్రయపడుతున్నారని కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఏబ్లాక్ అధ్యక్షులు కూరాకుల కృష్ణ అన్నారు.గోదావరి జలాలను హైదరాబాద్ కు శ్రీపాద,ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి తీసుకొచ్చే ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి కార్వాన్ నియోజకవరహం నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కూరాకుల కృష్ణ మాట్లాడుతూ...ఎవరు అడ్డుపడిన మూసీ ప్రక్షాళన చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారన్నారు.కాంగ్రెస్ పై కోపం ఉంటే ప్రజా సమస్యలపై కొట్లాడాలి కానీ,అభివృద్ధికి అడ్డు పడొద్దని ప్రతిపక్ష నాయకులకు కూరాకుల కృష్ణ సూచించారు.ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముంగి రఘుపాల్ రెడ్డి,రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యకులు వినోద్ సింగ్,కార్వాన్ బిబ్లాక్ మహిళా అధ్యక్షురాలు షకీలా,సీనియర్ నాయకులు ముల్లెపు వెంకటకృష్ణ,దుర్గా తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల10న తుది ఓటరు జాబితా..




**నారాయణపేట,సెప్టెంబర్08 (సూర్యరేఖ)** జెడ్పీ టీ సీ,ఎంపీటీసీ స్థానాల తు ది ఓటరు జాబితాను ఈ నెల10న వెలువరించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ ఎస్.శ్రీను తెలిపారు.జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం అదనపు కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందని అన్నారు.ముసాయిదా జాబితా,పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏమైన అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి అవసరమైన మార్పులు,చేర్పులుజరిపిన మీదట సెప్టెంబర్ 10వ తుదిజాబితా వెలువరిస్తామని సూచించారు. మండల స్థాయిలో నిర్వహించిన రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశంలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు.తుది ఓటరు జాబితా రూప కల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.ఈసమావేశంలో డిఆర్డిఓ మొగులప్ప,కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు సలీం బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు సాయిబన్న, బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్ రెడ్డి,సిపిఎం నాయకులు వెంకట్రాం రెడ్డి,బి.ఎస్.పి నాయకులు బొదిగల శ్రీ నివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చిర్రకుంట గ్రామంలో ఉచిత వైద్య శిబిరం..



**మందమర్రి,సెప్టెంబర్ 08(సూర్యరేఖ)** మందమర్రి మండలంలోని చిర్రకుంట గ్రామ పంచాయతీలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.జిల్లా వైద్య అధికారుల ఆదేశాల మేరకు పొన్నారం పీహెచ్సీ వైద్యులు డాక్టర్ శరత్ ఆద్వర్యంలో సుమారు 100 మందికి పైగా గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు నిత్యం పొలం పనులలో నిమగ్నమవుతుంటారని ఆయా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు జరుగుతున్న సమయంలో ప్రజలు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని,దీనివల్ల శరీరంలోవృగ్మతలు నిర్ధారణ అవుతాయని తెలిపారు.ఈ శిబిరంలో ఎఎన్ఎం గ్లోరి,హెల్త్ అసిస్టెంట్ కుమారస్వామి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందె రామచందర్,మాజీ సర్పంచ్ ఒడ్నాల కొమురయ్య,పంచాయతీ సెక్రెటరీ రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం..





**ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా ఉండాలి.**
**మండల విద్యాధికారి మీర్జా ఖలి ముల్లా..**

నారాయణపేట,సెప్టెంబర్08(సూర్యరేఖ)మరికల్ లో మండల వనరుల కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ప్రభుత్వ ఆదేశానుసారం మండల స్థాయిలో 17 మంది ఉపాధ్యాయులను బెస్ట్ టీచర్స్ గా ఎంపిక చేశారు.ఈ కార్యక్రమం మండల విద్యాధికారి మీర్జాకరి ముల్లా ఆధ్వర్యంలో జరిగింది.మరి కల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నాగరత్నమ్మ కన్మనూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాల్ నారాయణ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్,విజయ్ కృష్ణలు టిపియుఎస్, పిఆర్ టియు సంఘ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శిల వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని,ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా ఉండాలని,విధుల పట్ల నిర్లక్ష్యం వహించారాదని క్రమశిక్షణ అంకితభావంతో పనిచేయాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.

# సింగరేణి కార్మికులు లాభాల్లో 40శాతం వాటా,కొత్త ట్రాన్స్ఫర్ పాలసీ రద్దు







**బెల్లంపల్లి,సెప్టెంబర్08(సూర్యరేఖ)** సింగరేణి కాలరీస్ ఉద్యోగులు సమస్త ప్రగతికి పునాదులుగా నిలుస్తూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి 72 మిలియన్ టన్నుల లక్ష్యానికి గాను 69.06 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించి 96 శాతం టార్గెట్‌ను చేరుకొని రికార్డు స్థాయి డిస్పెచ్‌ను నమోదు చేశారు.ఈ నేపథ్యంలో సింగరేణి కార్మికులకు తక్షణమే లాభాల్లో40 శాతం స్వామ్య వాటాను కార్మికులకు ప్రకటించి చెల్లించే తేదీని ఖరారు చేయాలని,కొత్త ట్రాన్స్ఫర్ పాలసీని రద్దు చేయాలని,సొంత ఇంటి పథకాన్ని కాంట్రాక్ట్ కార్మికులకు అమలు చేయాలని,కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని,లేక పర్మినెంట్ హెూదా ఇవ్వాలని, నూతన బొగ్గు గనులను వెంటనే ప్రారంభించాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ విజ్ఞప్తిని సింగరేణి సిఅండ్ ఎండికి సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ తేఎన్ టేయుసి నాయకులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో టి.మణిరామ్ సింగ్,సింగరేణి కాలనీస్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆవుల సుధాకర్ జిల్లా ప్రధాన కార్యదర్శితలారి రాజు పెద్దపల్లి పార్లమెంట్ తేఎన్ టేయుసి ప్రధాన కార్యదర్శి గైన తిరుపతి,బెల్లంపల్లి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.రాజయ్య ఎస్ఆర్పి ఏరియా తేఎన్ టేయుసి నాయకులు ఎండి సులేమాన్,టిఎన్ టేయుసి ఆర్గనైజర్ కన్నూరి శ్రీనివాస్,ఆర్గనైజింగ్ సెక్రటరీ, బెల్లంపల్లి పి.సదానందం ద్వారా కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని డిమాండ్లను తక్షణమే అమలు చేయాలని సింగరేణి కార్మిక సంఘం నేతలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## ప్రజావాణికి 64ఫిర్యాదులు

**జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి**



**రంగారెడ్డి,సెప్టెంబర్8(సూర్యరేఖ)** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి వెల్లడించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 64 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ-42,ఇతర శాఖలు-22,మొత్తం 64 దరఖాస్తులు అందాయన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత,వివిధ శాఖల జిల్లా అధికారులు,మున్సిపల్ అధికారులు,మండల హశీల్దారులు,కలెక్టరేట్ సూపరింటెండెంట్లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గురువు లేని విద్య గుడ్డి విద్య..



రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్





**రాజేంద్రనగర్,సెప్టెంబర్8(సూర్యరేఖ)**గురువు లేని విద్య గుడ్డి విద్య అని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ అన్నారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రేమావతిపేట్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు మునీరా బేగం ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ హాజరు అయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాల కోసం విద్యార్థులకు వివరించారు. పిల్లలకు మరీ ముఖ్యంగా త్రాగే నీటిని ప్లాస్టిక్ బాటిల్ తో గ్లాస్,లతో తాగకుండా విద్యార్థులకు కమతం లక్ష్మి స్టీల్ వాటర్ బాటిల్స్ విద్యార్థులకు అందరికీ అందజేశారు.టీచర్ సరిత,అంగన్వాడి టీచర్ వినోద,మాజీ విద్యా కమిటీ ఛైర్మెన్ పోనమోని మల్లేష్ యాదవ్ సహకారంతో శ్రీ విశ్వనాథ్ పాఠశాలకు కుర్చీలను అందించారు. టి.భవానిదాస్ పాఠశాలకు మైక్ సెట్ డొనేట్ చేయగా,పాఠశాలలో రాత్రి వెళ్లలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుండటంతో వాటిని అరికట్టడానికి పాఠశాల ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి దివంగత ఎడ్లకాడి నర్సింహా జ్ఞాపకార్థం ఎడ్లకాడి సూర్యం కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు.పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు.ఈ కార్యక్రమలో జైభీమ్ జైరామ్ సంఘం అధ్యక్షులు గోల్కొండ రాజు కుమార్,పుస్తకాల మురళి మోహన్,తదితరులు పాల్గొన్నారు.

## నాయకుని ముసుగులో చీకటి దందాలు.

**ముస్తాబాద్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** మండలములోని ఓ గ్రామానికి చెందిన నాయకుడు పార్టీలు మారుతూ,అధికారంలో ఏపార్టీ ఉంటే ఆ పార్టీలోకి చేరడం,ఆ పార్టీని అడ్డము పెట్టుకుని, పంచాయతీలు చేయడం భూముల వ్యవహారంలో జోక్యం చేసుకోవడం,కేవలము మద్యానికి బానిసై ఈ నాయకుడు,గ్యాంగులను వేనుకేసుకొని తిరగరడం,బెదిరించడం లాంటివి చేస్తున్నాడని ఆరోపణలు వస్తున్నాయి.ఈ నాయకుడి వికృత చేష్టలు మండలంలో హద్దు అదుపు లేకుండా పోతున్నాయని,ఆ నాయకుని పై ఆ పార్టీ వారే చర్యలు తీసుకోవాలని,ఇతరత్రా పార్టీల నాయకులు కోరుతున్నారు.

## ఈ నెల 10 రంగారెడ్డి జిల్లా జెడ్పీటీసీ,ఎంపీటీసీ స్థానాల తుది ఓటర్ జాబితా

**ఇంచార్జ్ జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్**



**రంగారెడ్డి,సెప్టెంబర్08(సూర్యరేఖ)** రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన జెడ్పీటీసీ,ఎంపీటీసీ స్థానాల తుది ఓటరు జాబితాను ఈ నెల 10న వెలువరించడం జరుగుతుందని ఇంచార్జ్ జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ వెల్లడించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇంచార్జ్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె. శ్రీనివాస్ అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందని అన్నారు.ముసాయిదా జాబితా,పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు.వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి,అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట సెప్టెంబర్ 10వ తుది జాబితా వెలువరిస్తామని సూచించారు. మండల స్థాయిలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కూడా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు.తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి,డిప్యూటీ సీఈఓ రంగారావు,ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి ఎన్.మహేష్,ఆవుల యాదయ్య,కె.రాజ్ కుమార్,బిఆర్ఎస్ నుండి వనం శ్రీనివాస్,బిజెపి నుండి కె.అనంతయ్య గౌడ్,అంబాజీ శ్రీనివాస్, సిపిఐ(యం) నుండి పగడాల యాదయ్య,సిపిఐ నుంచి పాలమాకుల జంగయ్య,పానుగంటి పర్వతాలు టిడిపి నుండి జే.రవీందర్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కాలనీ మరుగుదొడ్డి నీళ్లతో ప్రమాదంలో ప్రజల ఆరోగ్యం



**రామాయంపేట,సెప్టెంబర్8(సూర్య రేఖ)** రామాయంపేట పట్టణంలోని కేసీఆర్ కాలనీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పక్షం రోజులుగా మరుగుదొడ్డి నీళ్లు,మలమూత్రాలు ఇళ్ల మధ్యలోంచి విచ్చలవిడిగా పారుతుండటంతో దుర్వాసన అసహనంగా మారింది. కాలనీవాసులు డెంగ్యూ,రక్త విరోచనాలు,చర్మవ్యాధులు వంటి రోగాలు వ్యాప్తి చెందే పరిస్థితి ఉందని హెచ్చరిస్తున్నారు.

**కాలనీవాసుల ఆవేదన..**

“పచ్చని చెట్ల మధ్య ఇల్లు కట్టించాం ఆరోగ్యంగా ఉంటామని అనుకున్నాం. కానీ ఇప్పుడు మలిన నీళ్ల మధ్యలో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు.“నడిచి వెళ్లే ప్రతి అడుగులో మురుగు అంటుకుంటోంది.ముక్కుపుటలు పగిలే దుర్వాసనతో ఇళ్లలో కూర్చోలేని స్థితి.ఇప్పటికే చాలామంది పిల్లలు,వృద్ధులు అనారోగ్యం పాలయ్యారని కాలనీవాసులు రోధిస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం..**

స్థానికులు చెబుతున్నట్లుగా పక్షం రోజులుగా ఈ పరిస్థితి కొనసాగుతోంది.అధికారులు వచ్చి చూసినా చర్యలు తీసుకోలేదు.సమస్య పరిష్కారం కాకుండా కాలనీలో వసూళ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**ఆరోగ్య ముప్పు..**

వర్షం పడితే నీరు బయటకు పోయే మార్గం లేదు.సాధారణ వర్షపు నీరు అయితే ఇబ్బంది తక్కువే.కానీ మరుగుదొడ్డి నీళ్లు,మలమూత్రాలు మూడు మీటర్ల వెడల్పుతో రహదారుల మీదుగా పారుతుండటంతో కాలనీ అంతా దుర్వాసన కమ్మేసింది.వైద్యులు హెచ్చరిస్తూ ఈ పరిస్థితి కొనసాగితే డెంగ్యూ,విరోచనాలు,చర్మవ్యాధులు పెద్ద ఎత్తున వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని సూచిస్తున్నారు.

**తక్షణ చర్యలు తీసుకోవాలని వాసుల డిమాండ్..**

కాలనీవాసులు మున్సిపల్ అధికారులను తక్షణం స్పందించాలని,నీటిని మళ్లించే చర్యలు చేపట్టాలని,లేకపోతే వందల సంఖ్యలో ప్రజలు రోగాల భారీన పడతారని హెచ్చరిస్తున్నారు.

# క్యాండ్యూట్ కాలువ సమస్యకు పరిష్కారం చూపాలి





**భారత రాష్ట్ర సమితి ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు**

**మణికొండ,సెప్టెంబర్08(సూర్యరేఖ)** క్యాండ్యూట్ కాలువ సమస్య తీవ్రమై ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారని,అధికారులు పరిష్కరించడంలో అలసత్వం వహిస్తున్నారని భారత రాష్ట్ర సమితి ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు మండి పడ్డారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఇంజనీర్ సర్ విశ్వేశ్వర రావు పర్యవేక్షణలో ఉస్మాన్ సాగర్ గండిపేట రిజర్వాయర్ నుంచి నీటి గురుత్వాకర్షణ సహజశక్తి ద్వారా హెరిటేజ్ ఛానెల్ తో నీటి కాలువ కోకాపేట నార్సింగి పుప్పాలగూడ, మణికొండ,షేక్ పేట,మెహదీపట్నం గుండా ఆసీఫ్ నగర్ ఫిల్టర్ బెడ్ వరకు త్రాగునీరు వెళ్ళడానికి కట్టిన క్యాండ్యూట్ కాలువ పరిస్థితి నేడు అధ్వాన్నంగా మారిందన్నారు. అయినా ఈ విషయంపై జలమండలి అధికారులకు తెలిపారు. ఈ విషయమై ప్రజా సౌకర్యార్థం తగిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు.త్రాగు నీరు వృథాగా 24 గంటలు ధారాళంగా ప్రవహిస్తున్న పరిస్థితి నెలకొందన్నారు.ప్రత్యేకంగా పాత ఆంధ్రాబ్యాంక్ ఎదురు వీధి చైతన్య కాలేజీ నుండి పందేన్ వాగు కాలువ వరకు గల పరిస్థితిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక,యువ విభాగపు అధ్యక్షుడు సంఘం శ్రీకాంత్,యువ నాయకుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు



**ఇల్లందు,సెప్టెంబర్08(సూర్యరేఖ)**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుపట్టణంలో ఈ సోమవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ... ఆర్యవైశ్య సంఘం నాయకులు సభ్యులు వ్యాపారులు నాపై చూపుతున్న ప్రేమాభిమానాలు నాకు మరింత సేవా తపనను పెంచుతున్నాయన్నారు.ఈ వేడుకలు నా జీవితంలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయి ఆనందం వ్యక్తం చేశారు.అనంతరం ఎమ్మెల్యే స్వహస్తాలతో 50 మంది పేద మహిళాలకు చీరలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం నాయకులు ఆయనను శాలువాలతో ఘనంగా సత్కరించారు. వేడుకల వేదిక ఆనందోత్సాహాలతో,శుభాకాంక్షలతో కిక్కిరిసిపోయింది. ప్రజల మధ్య ఎల్లప్పుడూ నిలిచి నియోజవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడిగా కోరం కనకయ్యను స్థానికులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు,కోరం సురేందర్,చిట్టిబాబు,పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్,మడుగు సాంబమూర్తి బోళ్ల సూర్యం చిల్లా శ్రీనివాస్,మండల రాము శ్రీహరి హర క్షేత్రం దేవాలయం కమిటీ చైర్మన్ గండె సదానందం,పింగళి నరేష్,సింగరేణి మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు జుగల్ కిషోర్,ఆర్యవైశ్య సంఘం నాయకులు అర్వపల్లి రాధాకృష్ణ,కండె రమేష్,నరేంద్రుల అను యెలుగూరి మల్లికార్జున్ తాటిపల్లి సుబ్బారావు, సైఫా రాజశేఖర్, యెలుగూరి మధుబాబు అయితా శ్రీనివాస్,చందా భద్రం కుమార్ పుల్లూరు సతీష్,ఆకుల సతీష్ గందే సురేష్,రామిడి శంకర్,తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో రూ.20వేలు ఇవ్వాలి

**వేతనంతో కూడిన పండుగ సెలవులు ఇవ్వాలి..**

**సింగరేణి కాంటాక్ట్ టు కార్మిక సంఘాల డిమాండ్..**

**ఇల్లందు,సెప్టెంబర్08(సూర్యరేఖ)**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుసింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఇల్లందు సింగరేణి కాంట్రాక్టు కార్మికుల అడ్డవద్ద సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జేఏసీ నాయకులు షేక్ యాకుబ్ షావలి,ఎస్ ఏనబి భానోత్ రామ్ సింగ్, లు హాజరై మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలన్నారు. పోయిన సంవత్సరం సింగరేణి లాభాలలో రూ.5వేలు ఇచ్చారని,ఈ వార్షిక లాభాలలో రూ.20 వేలు కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్మికులు సింగరేణిలో అత్యంత కీలకంగా పని చేస్తున్నారని, కాంట్రాక్టు కార్మికులు లేనిదే ఈరోజు సింగరేణి నడిపించే పరిస్థితి లేదని గుర్తు చేశారు.ఈలాభాలలో కాంట్రాక్టు కార్మికుల శ్రమ ఉందన్నారు. కార్మికులకు అత్యంత తక్కువ వేతనాలు ఇవ్వడం మూలాన ఈరోజు సింగరేణిలో లాభాలు వచ్చాయని వారు కాంగ్రెస్ ప్రభుత్వానికి గుర్తు చేశారు.సింగరేణి కాంట్రాక్టు కార్మికులు తమ వ్యక్తిగత దరఖాస్తులతో ఈ నెల 12న చలో ప్రజాభవన్ కి తరలివచ్చి ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇవ్వాలని కార్మిక నాయకులు కోరారు.చలో ప్రజాభవన్ కోసం ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జేఏసీ నాయకులు తాళ్లూరి కృష్ణ, కొత్తపల్లి రఘు పాల్గొన్నారు.



## ఘనంగా కాంగ్రెస్ పార్టీ మాటూర్ గ్రామ అధ్యక్షులు జన్మదిన వేడుకలు..



**అందోల్,సెప్టెంబర్08(సూర్యరేఖ)** సంగారెడ్డి జిల్లా,రాయికోడ్ మండలం మాటూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,యువ నాయకులు మక్సుద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.పార్టీ నాయకులు,పత్రిక మిత్రులు,స్నేహితులు కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.మక్షుద్ కుటుంబాన్ని ఆదేవుడు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు చూడాలని అక్షింతలతో ఆశివర్వదించారు.ఈకార్యక్రమంలో హాజరైన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో “సూర్య”దినపత్రిక రిపోర్టార్ హన్మంతు,దిశా దినపత్రిక రిపోర్టర్ శ్రీను,రాజ్,కుమార్,ప్రసాద్,కృష్ణ,రాజ్ కుమార్,కృష్ణ, ఇమ్మానియేల్, శిరమణి,తయ్యబ్,రాజు,తదితరులు పాల్గొన్నారు.

## కొలిక్కి వచ్చినట్లేనా..




**చెన్నూర్:** చెన్నూర్ ఎస్బీఐ%-%2 బ్రాంచిలో కుంభకోణం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 20 కిలోల బంగారు ఆభరణాలు, రూ.1.10 కోట్ల నగదు కోంభకోణ కేసును పక్షం రోజుల్లో రామగుండం సీపీ నేతృత్వంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు 90 శాతం పురోగతి సాధించినట్లు తెలిసింది. పోలీసులు సుమారు 19 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు తెలిసింది. ఈనెల 3 నుంచి 6 తేదీ వరకు గణేశ్ నిమజ్జనంలో పోలీసు అధికారులు బిజీబిజీగా ఉన్నారు. సోమవారం పనిదినాలు కావడంతో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో బంగారు అభరణాలు రికవరీ చేసే అవకాశం ఉందని సమాచారం.

**రికవరీ బంగారం కోర్టు ద్వారానే..**

పోలీసులు పూర్తిస్థాయిలో రికవరీ చేసిన బంగారు ఆభరణాలను కోర్టులో అప్పగిస్తారని తెలిసింది. బ్యాంక్ లీగల్ అడ్వయిజర్ బ్యాంక్‌లో మాయమైన ఆభరణాల వివరాలను కోర్టుకు అప్పగించి స్వాధీనం చేసుకుంటారని సమాచారం. ఇదంతా పక్షం రోజులు పడుతుందని తెలిసింది. కోర్టు ద్వారా బ్యాంక్ స్వాధీనం చేసుకున్న తర్వాత బాధితుల వారీగా నగలు పరిశీలించాల్సి ఉంటుంది. 20 కిలోల బంగారు ఆభరణాలు కావడంతో 402 మంది బా?ధితులకు సంబంధించినవి వేరు చేయాలంటే రెండు నెలలు పట్టే అవకాశం ఉందని బ్యాంక్ అధికారులు అంటున్నారు.

**నేడు బ్యాంక్ ఎదుట ఆందోళన?**

ఎస్బీఐలో గోల్డ్ రికవరీ అయిన తర్వాత ఆభరణా లు ఎప్పుడిస్తారనే అనుమానం బాధితులను వెంటాడుతుంది. పూర్తిస్థాయిలో అధికారులు తమకు ఎప్పుడిస్తారనే సమాచారం లేక సోమవారం బ్యాంక్ ఎదుట ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని పలువురు బాధితులు చర్చించుకుంటున్నట్లు తెలిసింది.

## ప్రభుత్వ బడులకు రేటింగ్

**ఆరు అంశాల ఆధారంగా నిర్ణయం**

**రేటింగ్ సాధించిన స్కూళ్లకు పురస్కారాలు**



**కరీంనగర్:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ రేటింగ్(ఎస్‌హెచ్‌వీఆర్) పేరుతో మెరుగైన సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించాయి. పాఠశాలలు పరిశుభ్రంగా ఉంటే విద్యార్థుల ఆరోగ్యాలు బాగుంటాయని, వారి ఆరోగ్యాలు బాగుంటే నాణ్యమైన చదువు అందుతుందని భావించిన కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి 2020 వరకు పాఠశాలలకు ఏటా ప్రత్యేక పురస్కారాలు అందించింది. ఐదేళ్లుగా నిలిచిన ఈ కార్యక్రమాన్ని మళ్లీ విద్యా సంవత్సరం ప్రారంభించింది. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ రేటింగ్(ఎస్‌హెచ్‌వీఆర్) పేరుతో ప్రత్యేక పురస్కారాలు అందించనుంది. మూత్రశాలలు, పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్ల వినియోగం, నీటివసతి తదితర అంశాలను పక్కాగా అమలు చేస్తున్న పాఠశాలలకు రేటింగ్ ఇవ్వనున్నారు. 60అంశాల ఆధారంగా 1%-%5 రేటింగ్ కేటాయించనున్నారు. అత్యుత్తమ రేటింగ్ సాధించి, జాతీయస్థాయికి ఎంపికై న పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష నజరానా అందించనుంది. జిల్లావ్యాప్తంగా 651 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 35వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. మనఊరు%-% మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాలల అమలుతో చాలా పాఠశాలల రూపురేఖలు మారాయి. కిచెన్ గార్డెన్ల వినియోగం, మరుగు దొడ్ల నిర్వహణ మెరుగుపడ్డాయి. ఇలాంటి పాఠశాలల్లో ఆరు ప్రధానాంశాలను నమోదు చేసి, దాన్నిబట్టి రేటింగ్ ఇస్తారు. మొత్తం 60 ప్రశ్నలకు 125 మార్కులు సాధిస్తే అయిదు స్టార్స్ ఇస్తారు. నీటి సంరక్షణ, తాగునీటి వసతికి 22 మార్కులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, చేతుల శుభ్రతకు 27, మొక్కలు తోటల పెంపకానికి 14, వ్యర్థాల నిర్వహణకు 21, విద్యుత్తు పొదుపు, సోలార్ వినియోగానికి 20, పర్యావరణ పరిరక్షణ అవగాహనకు 21 మార్కులు ఉంటాయి. అయిదు రేటింగ్స్ సాధించిన పాఠశాలలకు కేంద్రం పురస్కారాలు అందించే అవకాశం ఉంది. పాఠశాలలను అభివృద్ధి చేసి, నిర్వహణలో తమవంతు కృషి చేస్తున్న హెచ్‌ఎంలు చొరవ తీసుకొని నమోదు చేయాల్సిన అవసరం ఉంది. ఆరు అంశాల ఆధారంగా పాఠశాలల రేటింగ్‌ను నిర్ణయిస్తారు.

జాతీయస్థాయి వరకు పోటీ

స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ రేటింగ్(ఎస్‌హెచ్‌వీఆర్) కార్యక్రమంపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈనెల 4 నుంచి 30వ తేదీ వరకు ఉపాధ్యాయులు వారి పాఠశాలల వివరాలు ఎస్‌హెచ్‌వీఆర్ యాప్ లేదా ఎస్‌హెచ్‌వీఆర్.ఎడ్యుకేషన్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో యూడైస్ కోడ్‌తో లాగిన్ అయి నమోదు చేయాల్సి ఉంటుంది. జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయస్థాయి వరకు పోటీ పడేందుకు ఆరు అంశాల ఆధారంగా రేటింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు.



## రానాతో కలిసి నటించానన్న శివకార్తికేయన్.. ఇంతకీ ఏ సినిమానో తెలుసా..?

ఇటీవలే ఏఆర్ మురుగదాస్ డైరెక్షన్‌లో తెరకెక్కిన మదరాసి సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు శివకార్తికేయన్ ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కేవలం రెండు రోజుల్లోనే రూ.50 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. కాగా ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మరో క్రేజీ ప్రాజెక్ట్ (25వ చిత్రం) 'పరాశక్తి' ఆకాశం నీ హద్దురా ఫేం డైరెక్టర్ సుధా కొంగర డైరెక్ట్ చేస్తున్నారు. పొలిటికల్ పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న పరాశక్తిలో బాహుబలి యాక్టర్ రానా కీలక పాత్రలోనటిస్తున్నాడని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే దీనిపై మూవీ లవర్స్‌లో నెలకొన్న డైలామాకు చెక్ పెట్టాడు శివకార్తికేయన్. సైమా అవార్డ్స్ ఈవెంట్‌లో డాన్ యాక్టర్ స్టన్నింగ్ వార్తను షేర్ చేశాడు. తాను రానా దగ్గుబాటితో కలిసి నటించానన్నాడు శివకార్తికేయన్. అయితే ఆ ప్రాజెక్ట్ ఏంటో చెప్పకపోయినప్పటికీ.. పరాశక్తి అని హింట్ ఇచ్చేశాడు. రానా పొల్లాచ్చి షూటింగ్‌లో శ్రీలీలతో కలిసి జాయిన్ అయ్యాడని సమాచారం. ఈ మూవీలో రానాతోపాటు అథర్వ, రవి మోహన్, బాసిల్ జోసెఫ్ ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీ 2026లో ప్రేక్షకుల ముందుకు రానుంది. మరోవైపు రానా మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ మిరాయిలో కూడా కనిపించనున్నట్టు వార్తలు వస్తుండగా.. త్వరలోనే దీనిపై క్లారిటీ రానుంది.



## రామ్ పోతినేని ఆంధ్ర కింగ్ తాలూకా.. పప్పీ షేమ్ సాంగ్ రిలీజ్

టాలీవుడ్ హీరో రామ్ పోతినేని నటిస్తోన్న లేటేస్ట్ మూవీ 'ఆంధ్ర కింగ్ తాలూకా' ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే.. రామ్‌కు జంటగా నటిస్తోంది. ఈ మూవీకి మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ఫేమ్ పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 28న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ మూవీ నుంచి క్రేజీ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలోని పప్పీ షేమ్ అనే పాటను విడుదల చేశారు. అయితే ఈ సాంగ్‌ను రామ్‌నే ఆలపించడం విశేషం. ఆ పాటకు భాస్కరభట్ల లిరిక్స్ అందించహా.. వివేక్, మెర్విన్ కంపోజ్ చేశారు. కాగా.. ఈ సినిమాలో ఉపేంద్ర, రావు రమేశ్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు.

## మళ్లీ అదే స్టోరీ... ఇక్కడ ఫ్లాప్ అక్కడ హిట్

ఒకప్పుడు తమిళ సినిమాల క్వాలిటీనే వేరుగా ఉండేది. మార్కెట్ పరంగా రేంజ్ తక్కువ కావచ్చు కానీ.. కంటెంట్ క్వాలిటీ మాత్రం ఇండియాలో ఏ ఇండస్ట్రీకి తీసిపోని స్థాయిలో అక్కడి సినిమాలుండేవి. అక్కడ అనేక ప్రయోగాలు జరిగేవి. కమర్షియల్ సినిమాల్లోనూ వైవిధ్యం చూపించేవాళ్లు. రొటీన్ సినిమాలను పెద్దగా పట్టించుకునే వాళ్లు కాదు. కానీ గత దశాబ్ద కాలంలో మొత్తం మారిపోయింది. తమిళ సినిమాల క్వాలిటీ బాగా పడిపోయింది. ఒకప్పుడు అద్భుతమైన సినిమాలు అందించిన శంకర్, మణిరత్నం, మురుగదాస్ లాంటి దర్శకుల నుంచి పేలవమైన సినిమాలు వస్తున్నాయి.మురుగదాస్ సంగతే తీసుకుంటే.. 'స్పైడర్' దగ్గర్నుంచి ఆయన వరుసగా డిజాస్టర్లు డెలివర్ చేస్తున్నాడు. ఈ ఏడాది బాలీవుడ్లో ఆల్రెడీ 'సికందర్' సినిమాతో షాక్ తిన్నాడు మురుగదాస్. తమిళంలో తీసిన 'మదరాసి'తో ఆయన పుంజుకుంటాడేమో అని అభిమానులు ఆశించారు. ఐతే ఈ సినిమాకు కూడా డివైడ్ టాక్ తప్పలేదు. మురుగదాస్ గత చిత్రాలతో పోలిస్తే కొంచెం బెటర్ అనే టాక్ వచ్చింది తప్ప.. ఓవరాల్‌గా ఇది మెప్పించే సినిమా అయితే కాదు. విపరీతమైన సాగతీత.. యాక్షన్ ఎపిసోడ్లు తప్ప విషయం లేని బోరింగ్ సెకండాఫ్ సినిమాకు పెద్ద మైనస్ అయింది. తెలుగులో ఈ సినిమాకు ఆరంభం నుంచి ఆశించిన వసూళ్లు లేవు. రెండో రోజు సినిమా మరింత వీక్ అయింది. ఇక్కడ 'మదరాసి' ఫ్లాప్ అని తేలిపోయింది. కానీ తమిళంలో మాత్రం 'మదరాసి' వీకెండ్లో బాగా ఆడుతోంది. శుక్ర, శనివారాల్లో ఈ చిత్రం తమిళంలో మంచి ఆక్యుపెన్సీలతో నడిచింది. ఆదివారం కూడా చెన్నై సహా మేజర్ సిటీస్‌లో 'మదరాసి' స్ట్రాంగ్‌గానే కనిపిస్తోంది.





## 'కొంచెం కూడా సెన్స్ లేదు మీకు.. రాస్కెల్స్'.. మంచు లక్ష్మీ ఫైర్ !

టాలీవుడ్ నటి మంచు లక్ష్మి దాదాపు ఐదేళ్ల తర్వాత వెండితెరపై కనిపించనుంది. ప్రస్తుతం ఆమె దక్ష (ది డెడ్లీ కాన్సిఫరిసీ) అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే ఈ చిత్రం టీజర్ విడుదల చేయగా.. ఆడియన్స్ నుంచి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ఈ మూవీని తన సొంత బ్యానర్ లక్ష్మి ప్రసన్న పిక్చర్స్‌లో తెరకెక్కించారు. ఈ సినిమాకు మోహన్ బాబు, లక్ష్మీ ప్రసన్న నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ మూవీకి వంశీకృష్ణ మల్ల దర్శకత్వం వహించారు. ఈ సినిమా సెప్టెంబర్ 19న థియేటర్లలో విడుదల కానుంది. అయితే ఇటీవల దుబాయ్‌లో జరిగిన సైమా అవార్డ్స్-2025 వేడులకు హాజరైంది. మంచు లక్ష్మీకి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. అక్కడే మంచు లక్ష్మీ వేదిక వద్దకు వెళ్తుండగా ఆమెతో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఎగబడ్డారు. అదే సమయంలో ఓ అభిమాని అసభ్యకరంగా కామెంట్ చేయడంతో మంచు లక్ష్మీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ధైర్యం ఉంటే నా ముందుకు వచ్చి మాట్లాడరా? మీకసలు సెన్స్ లేదు రాస్కెల్స్.. అంటూ మండిపడింది. ఈ వీడియో నెట్టింట వైరల్ కావడంతో నెటిజన్స్ సైతం కామెంట్ చేస్తున్నారు. ఆ తర్వాత చాలామంది అభిమానులతో సెల్ఫీలకు పోజులిచ్చింది మంచు లక్ష్మీ. కాగా.. మంచు లక్ష్మీ నటించిన యాక్షన్ అండ్ క్రైమ్ థ్రిల్లర్‌లో సముద్రఖని, మలయాళ నటుడు సిద్దిక్, చైత్ర శుక్ల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మోహన్ బాబు కూడా ఒక ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా మంచు లక్ష్మీ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. లక్ష్మి ప్రసన్న పిక్చర్స్ నుంచి పదేళ్ల తర్వాత దక్ష రూపంలో మరో చిత్రం విడుదల కానుంది. 2015లో మామ మంచు అల్లుడు కంచు మూవీ ఆ బ్యానర్ నుంచి చివరిగా విడుదలైంది.



## జాన్వీ కపూర్ చాలా గ్రేట్..

### అనీల్ కపూర్ కామెంట్స్ వైరల్

బాలీవుడ్ బ్యూటీ, అతిలోక సుందరి శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో బిజీగా ఉంటూనే, సౌత్ సినిమాల్లోనూ తన మార్క్ క్రియేట్ చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ఎన్టీఆర్‌తో నటించిన "దేవర" చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న జాన్వీ, త్వరలోనే రామ్ చరణ్ సరసన "పెద్ది" సినిమాతో పలకరించబోతుంది. ఈ సినిమాపై జాన్వీ చాలా హోప్స్ పెట్టుకుంది. ఈ సినిమాని బుచ్చిబాబు ప్రత్యేక శ్రద్ధతో తెరకెక్కిస్తుండగా, ఇందులో జాన్వీ పాత్ర కూడా చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉండనుందని అంటున్నారు. అయితే తాజాగా జాన్వీ గురించి బాలీవుడ్ ప్రముఖ నటుడు, ఆమె బాబాయ్ అయిన అనిల్ కపూర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో వైరల్‌గా మారాయి. సాధారణంగా స్టార్ హీరోయిన్ షూటింగ్‌కి వస్తే, రెమ్యూనరేషన్ కాకుండా, ఆమె ట్రావెలింగ్, హోటల్, ఫుడ్ ఖర్చులతో పాటు, స్టాఫ్, తల్లి, మేనేజర్ల ఖర్చులు అన్నీ నిర్మాతే భరిస్తారు. ఇది ఇండస్ట్రీలో ఓ సాధారణ నిబంధనగా మారిపోయింది. అయితే ఈ విషయంలో జాన్వీ కపూర్ మాత్రం భిన్నంగా ఉంటుందని అనిల్ కపూర్ వెల్లడించాడు. జాన్వీ ఎక్కడికైనా షూటింగ్‌కి వెళ్లాల్సి వచ్చినప్పుడు ఫ్లైట్ టికెట్లు తనవే. స్టాఫ్ కావొచ్చు, సహాయులు కావొచ్చు, ఎవ్వరైనా ఆమెతో వస్తే వాళ్ల ఖర్చులు కూడా జాన్వీనే భరిస్తుంది. నిర్మాతలపై ఎలాంటి అదనపు భారంగా మోపదు. ఆమె అంతా స్వయంగా చూసుకుంటుంది అని అన్నారు అనిల్. అనిల్ కపూర్ ఈ కామెంట్స్ చేసిన తర్వాత, జాన్వీ కపూర్‌పై పరిశ్రమవర్గాలు ప్రశంసలు కురిపిస్తున్నాయి. ఇప్పటి తారలు చిన్న విషయానికే పెద్ద బడ్జెట్ భారాన్ని నిర్మాతలపై మోపుతున్న కాలంలో, జాన్వీ లాంటి స్టార్ హీరోయిన్ తన ఖర్చులను తానే భరించడం నిజంగా ప్రశంసనీయం అంటున్నారు. జాన్వీని చూసి ఇతర హీరోయిన్స్ తమ పద్ధతిని మార్చుకుంటారా అని ముచ్చటించుకుంటున్నారు. ఈ రోజుల్లో నిర్మాతలు ఖర్చుల విషయంలో తడిసి ముద్దవుతున్నారు. అలాంటి సమయంలో జాన్వీ లాంటి సెలబ్రిటీలను ఆదర్శంగా తీసుకుంటే, ఇండస్ట్రీకి అంతా మంచి జరుగుతుంది. ఇక జాన్వీకి ఇప్పుడు బాలీవుడ్ ప్రాజెక్ట్స్ తోపాటు, త్వరలో మరిన్ని సౌత్ ఆఫర్స్ లైన్‌లో ఉన్నట్టు సమాచారం.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,